


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 336, పేజీలు - 08

మంగళవారం, మే 26, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట

**- రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్**



హైదరాబాద్ మెట్రో రైల్ సర్వీసును పూర్తిగా స్వాధీనం చేసుకున్న తెలంగాణ ప్రభుత్వం .. ఆర్థికంగా బలోపేతం చేసేలా కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) మొత్తం రూ.13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేసేందుకు అంగీకారం తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే .రామకృష్ణారావు సమక్షంలో

2లో..

## మహిళల ఆర్థిక అభివృద్ధి.. ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత

**- 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాలకు సీఎం శంకుస్థాపన**

- ఆడబిడ్డల ఆశీర్వాదంతో ప్రజా పాలనకు శ్రీకారం చుట్టామన్న సీఎం
- మహిళలనే మహారాణులుగా గుర్తించి, గౌరవిస్తున్నామన్న రేవంత్
- మహిళ శక్తి సంఘానికి చిరునామా “ఇందిర స్త్రీ శక్తి భవన్”లు
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని 8 వేల స్వయం సహాయక బృందాల గ్రామ సంఘం భవనాలకు సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మధ్య సొంత చెల్లెళ్లను అన్నలు ఇంట్లో నుంచి వెళ్లగొడుతున్నారని ఆస్తిలో వాటా అడుగుతారనే కారణంతో సొంత చెల్లిని కూడా ఇంట్లో నుంచే పంపిస్తున్న సందర్భంలో కోటి మంది ఆడబిడ్డలను ఈ మంత్రివర్గం సొంత సోదరీ మణుల్లా భావించి వారికి చీర పెట్టే కార్యక్రమాన్ని వారిని ఆర్థికంగా నిలబెట్టే ప్రణాళికను రూపొందించిందన్నారు. కోటి మంది ఆడ బిడ్డలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఆడబిడ్డల ఆశీర్వాదంతో తమ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. 2034లోగా కోటి మంది మహిళలను

2లో..

## రైతులకు రూ.50వేల రుణమాఫీ

**- తమిళనాడు సీఎం విజయ్ సంచలన నిర్ణయం**




చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడులో రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి డా. సి. జోసెఫ్ విజయ్ ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన లక్షలాది మంది రైతులకు ఊరటనిస్తూ భారీ రుణమాఫీని ప్రకటించారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయ, ఆర్థిక శాఖల మంత్రులు , ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షా సమావేశం అనంతరం సీఎం ఈ కీలక ప్రకటన చేశారు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సామాన్య, మధ్యతరగతి రైతు కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపింది.

**- 14 లక్షల మంది రైతులకు నేరుగా ప్రయోజనం**

ప్రభుత్వ తాజా ప్రకటన ప్రకారం.. గత ఏడాది మే 1, 2025 నుండి ఫిబ్రవరి 28, 2026 మధ్య కాలంలో సహకార బ్యాంకుల నుండి పంట రుణాలు తీసుకున్న వారందరికీ ఈ పథకం వర్తిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14,22,555 మంది రైతులు ఈ రుణమాఫీ వల్ల రుణ విముక్తులు కానున్నారు. దీనికోసం తమిళనాడు ప్రభుత్వంపై రూ. 2,044.46 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలే ముఖ్యమని సీఎం విజయ్ ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు.

2లో..

## జెన్-జీ కలల సాకారం

**- సీఎం సమక్షంలో మెటా, అమెజాన్‌తో ఒప్పందాలు**

- రాష్ట్రవ్యాప్తంగా 38 కొత్త ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన
- రూ.200 కోట్లతో ఏపీ క్లస్టర్ డెవలప్‌మెంట్, రూ.300 కోట్లతో సీఎం ఎంట్రప్రెన్యూర్ ప్రోగ్రామ్
- రాష్ట్రం నుంచి 100 యూనికార్న్ కంపెనీల ఏర్పాటు లక్ష్యమన్న సీఎం చంద్రబాబు



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఉత్పత్తులను అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో మెటా, అమెజాన్, జోహో వంటి ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ దిగ్గజ సంస్థలతో ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఎస్ఎంఈడీసీ) ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తయారైన ఉత్పత్తులకు ప్రపంచ విపణిలో




మార్కెటింగ్, బ్రాండింగ్ కల్పించి,

2లో..

## డీఎస్సీలో అక్రమాలు.. జగన్ ఆరోపణలు

**- మెగా డీఎస్సీపై సీబీఐ విచారణకు జగన్ డిమాండ్**

**- భారీగా అక్రమాలు జరిగాయని ఆరోపణలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ ప్రభుత్వం గతేడాది నిర్వహించిన మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగార్థులను దగా చేసిందని వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. మీరు నిర్వహించింది మెగా డీఎస్సీనా లేదా ఉద్యోగార్థులను మోసం చేసిన దగా డీఎస్సీనా? అని జగన్ ప్రశ్నించారు. పరీక్ష నిర్వహణలో పారదర్శకత ఎక్కడ ఉందని నిలదీశారు. తమ హయాంలో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేసి ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేసి మళ్లీ కొత్త నోటిఫికేషన్ ఇచ్చారని దాన్ని పబ్లిసిటీ కోసం వాడుకున్నారని జగన్ ఆరోపించారు. పేపర్లు లీక్ చేయడం, డేటా డిలీట్ చేయడం, మెరిట్ లిస్ట్ మాయం చేయడం లాంటి పనుల ద్వారా ఉద్యోగార్థులకు

2లో..

## నీది మిషన్ మోడ్ కాదు.. కమీషన్ మోడ్

**- రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు**

- ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన హరీశ్ రావు
- రోహిణి కార్తె వచ్చినా ధాన్యం ఇప్పటికీ కళ్లాల్లోనే ఉందని ఆవేదన
- రైతుల సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందగించిందని, ఐకేపీ సెంటర్లలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి గ్రామంలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన ఆయన, వరి ధాన్యాన్ని పరిశీలించి అక్కడి రైతుల సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన ఘాటు విమర్శలు చేశారు. రైతులకు సాగునీరు, కరెంట్, యూరియా అందించడం దగ్గరి నుంచి పండిన పంటను సేకరించే వరకు ప్రభుత్వం ప్రతి దశలోనూ పూర్తిగా ఫెయిల్ అయ్యిందని హరీశ్ రావు విమర్శించారు. రోహిణి కార్తె ప్రవేశించినా సరే, ఇప్పటికీ ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోవడం,

2లో..

## బెంగాల్‌లో అంకుశం సీన్లు

**- రౌడీలందర్నీ నిక్కర్లపై కొట్టుకుంటూ తీసుకెళ్తున్నారు**



కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో నేరగాళ్ల గుండెల్లో వణుకు పుట్టించేలా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. హౌరా డాన్' గా చలామణి అవుతున్న రౌడీ షీటర్ ఆకాష్ సింగ్‌ను పోలీసులు అతడు భయానక వాతావరణం సృష్టించిన వీధుల్లోనే ఊరేగించారు.?

కేవలం లోదుస్తులతో, సంకెళ్లు వేసి అతడిని నడిపించుకుంటూ తీసుకెళ్లడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రౌడీయిజం చేస్తే పర్యవసానాలు ఎలా ఉంటాయో చెప్పేందుకే పోలీసులు ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**- బాంబుల వర్షం..**

**పోలీసులపైనే కాల్పులు**

ఆకాష్ సింగ్ నేర చరిత్ర అత్యంత భయంకరమైనది. 2021లో హౌరాలో గ్యాంగ్ వార్ సమయంలో ఇతడు ఏకంగా పోలీసులపైనే తూటాల వర్షం కురిపించాడు.

2లో..

## పవన్ కళ్యాణ్ సంచలన నిర్ణయం

**- ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గం మొత్తం రద్దు**

- వర్గ విభేదాలు, క్రమశిక్షణారాహిత్యమే కారణమని వెల్లడి
- 25 మంది సభ్యుల మధ్య 54 గొడవలు ఉన్నాయని వ్యాఖ్య
- ఇకపై పార్టీలో కఠినంగా వ్యవహరిస్తానని స్పష్టం



అమరావతి (ప్రశ్న న్యూస్) జనసేన పార్టీలో తన పుష్కర కాలం నాటి సహనానికి స్వస్తి పలుకుతున్నానని, ఇకపై పార్టీలో క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించేది లేదని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

2లో..

## రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

**- వామపక్ష నేతలతో సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. డా.బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సీపీఎం రాష్ట్రకార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశం అయ్యింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. మద్దతు ధరలు ప్రకటించడమే తప్ప కేంద్రం రాష్ట్రంలో పంటను కొనుగోలు చేయడం లేదని, కనీసం 30 శాతం కూడా సేకరించడం లేదని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

రాష్ట్రంలో సుదీర్ఘ కాలం పెండింగ్ ఉన్న కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయంపై ఈ సందర్భంగా ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపింది.

2లో..

## భూదాన్ స్కామ్‌లో పొలిటికల్ లింకులు.?

- ఈడీ విచారణకు హాజరైన సీనియర్ ఐఏఎస్
- ధరణి రిజిస్ట్రేషన్ల అక్రమాలపై ముమ్మర దర్యాప్తు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో సంచలనం సృష్టించిన భూదాన్ భూముల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తీవ్ర అవకతవకల ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్, రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్ నేడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎదుట విచారణకు

2లో..

## అట్టహాసంగా పద్మ అవార్డుల ప్రదానోత్సవం

**- తొలి విడతలో 66 మందికి పురస్కారాలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ ‘గణతంత్ర మండపం’లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. 2026 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మొత్తం 131 పద్మ అవార్డులలో తొలి విడతగా

2లో..

ప్రజాప్రశ్న



# హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట

ఒప్పంద పత్రాలపై సోమవారం అధికారులు సంతకాలు చేశారు. ఈ రుణాన్ని 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక పద్ధతిలో చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ హైదరాబాద్ మెట్రోలోని 100శాతం వాటా ప్రభుత్వానికి బదిలీ అయిందని చెప్పారు. "నగరంలో రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది దేశ ఆర్థికాభివృద్ధికి హైదరాబాద్ నగరం కీలక చోదకశక్తిగా ఎదుగుతోంది మెట్రో అనుసంధానం బలోపేతం వల్ల ట్రాఫిక్ తగ్గి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయి" అని తెలిపారు. ఈ సందర్భంగా రుణాన్ని రీఫైనాన్స్ చేసినందుకు సహకరించిన కేంద్రం, ఐఆర్ఎఫ్సీ, ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో సంస్థ బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1, మూడు కారిడార్లలో 57 స్టేషన్లతో 69.2 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. పబ్లిక్-ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ (పీపీపీ) కింద అభివృద్ధి చేసిన ప్రపంచంలోని అతిపెద్ద మెట్రో రైల్ ప్రాజెక్టులలో ఇది ఒకటి. ఈ నెట్‌వర్క్ ప్రస్తుతం ప్రతిరోజూ ఐదు లక్షలకు పైగా ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చుతోంది. ఈ రీఫైనాన్సింగ్, మెట్రో నెట్‌వర్క్‌ను కొత్త కారిడార్లలోకి విస్తరించడానికి, హైదరాబాద్ మహానగర అంతటా లాస్ట్-మైల్ కనెక్టివిటీని మెరుగుపరచడానికి తెలంగాణ ప్రభుత్వ ప్రణాళికలకు కూడా మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు. ఈ ఫైనాన్సింగ్‌లో ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజులు, కమిట్‌మెంట్ ఛార్జీలు లేదా ముందస్తు చెల్లింపు జరిమానాలు లేవని ఐఆర్ఎఫ్సీ స్పష్టం చేసింది. ఐఆర్ఎఫ్సికి చెల్లించాల్సిన బకాయిలను తీర్చడానికి తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన బేషరతు హామీ, రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీ, ఆర్బీఐ మద్దతు కలిగి డైరెక్ట్ డెబిట్ ఆదేశాలు ఉన్నాయి.

# మహిళల ఆర్థిక అభివృద్ధి..
# ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత

కోటీశ్వరులను చేసే బాధ్యత తమ మంత్రివర్గం తీసుకుంటుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అవసరమైన ప్రణాళికలు రచించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామన్నారు. 29 నెలల్లో పది వేల కోట్ల రూపాయలకుపైగా మహిళలకు ఉచిత బస్సు కోసం ఆర్టీసీకి చెల్లించామన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రద్దు చేయాలని గిట్టని వాళ్లు ప్రయత్నించారన్న రేవంత్ రెడ్డి.. ఆటో కార్మికులు, రిక్షా కార్మికులను రెచ్చగొట్టారన్నారు. అయినా సరే ప్రభుత్వం వెనక్కి తగ్గలేదన్నారు. చాలా మంది మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారనే భావన కలుగుతున్న సమయంలో మహిళలను బస్సులకు యజమానులు చేయాలనే ఉద్దేశంతో వెయ్యి బస్సులను మహిళా సంఘాలు కొనుగోలు చేసి ఆర్టీసీకి ప్రతి నెలా రూ.70 వేల చొప్పున అద్దెకు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. అందులో భాగంగా 553 బస్సులను ఇవాళ అంకితం చేయబోతున్నామన్నారు. మండలానికి ఒక బస్సు చొప్పున పరేడ్ గ్రౌండ్‌లో అందరూ ఒకచోట చేరి జూన్ ఐదో తేదీ సాయంత్రం బస్సుల ప్రారంభోత్సవం జరపాలని మంత్రివర్గం ఆలోచన చేస్తోందన్నారు. వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టును మహిళలకు ఇవ్వాలని భావిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రాల్లో మహిళలతో పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయించామన్నారు. వీటి ద్వారా మహిళలు నెలకు రూ.4-5 లక్షలు సంపాదిస్తున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి జిల్లా కేంద్రంలో వీలైనంత వరకు పెట్రోల్ బంకులకు స్థలాలు కేటాయించి ఆడబిడ్డలతో పెట్రోల్ బంకుల వ్యాపారం చేయించాలని నిర్ణయించామన్నారు.ప్రస్తుతం రూ.5 లక్షలు ఉన్న బ్యాంకు లింకేజ్‌లను రూ.10 లక్షలకు పెంచుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.60,472 కోట్లను మహిళలకు బ్యాంక్ లింకేజీలు ఇచ్చిందన్నారు. నిర్మల్ జిల్లా మహిళా సంఘాలు అప్పులు చెల్లింపులో తొలి స్థానంలో ఉన్నాయని సీఎం కొనియాడారు.8500 ఐకేపీ కేంద్రాల్లో మహిళలు ధాన్యం కొనుగోలు చేస్తే.. రవాణా, మిల్లర్లతో సమస్యలు వస్తున్నాయన్నారు. భవిష్యత్తులో మహిళలే స్వయంగా రైస్ మిల్లులు కట్టుకునేలా రుణాలు ఇప్పిస్తామన్నారు. ధాన్యం నిల్వ చేయడానికి గోడౌన్లు కట్టుకోవడానికి స్థలాలు కూడా ఇస్తామన్నారు. లాజిస్టిక్ పార్కుల నిర్మాణానికి అవసరమైతే 100 ఎకరాల స్థలమైనా కేటాయిస్తామన్నారు. ప్రతి మండలంలో గోడౌన్ల నిర్మాణం, మిల్లుల ఏర్పాటుకు అనుగుణంగా 2-4 స్థలాలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సీఎం సూచించారు. బ్యాంకులతో మాట్లాడి వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడానికి సహకారం అందిస్తామన్నారు.మహిళా సంఘాలే సూపర్ మార్కెట్లు ఏర్పాట్లు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున కార్పస్ ఫండ్ ఇస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతి మహిళ ఇందులో కొంత పెట్టుబడి పెట్టి రాష్ట్రవ్యాప్తంగా మహిళా శక్తి సూపర్ బజార్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం పట్టణాల్లో అవసరమైన భూములను నామమాత్ర ధరకు 30 ఏళ్లకు లీజ్‌కు ఇవ్వాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి సీఎం సూచించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన చీరెలను పంట పొలాల్లో పిట్టలను పారద్రోలడానికి వాడారని ఆడబిడ్డలకు తాము నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తున్నామన్నారు. త్వరలోనే పట్టణాల్లోని ఆడబిడ్డలకు కూడా చీరలు పంచుతామన్నారు. గతంలో పాలపిట్ట రంగు చీర ఇస్తే ఇప్పుడు చిలక పచ్చ రంగు చీరలను ఇస్తున్నామన్నారు. చాలా మంది సొంత చెల్లెళ్లను ఇంట్లో నుంచి అన్నలు వెళ్లగొడుతున్నారు. ఈ మధ్యే రాజకీయాల్లో మీరు చూశారంటూ సీఎం రేవంత్ రెడ్డి తన ప్రత్యర్థులపై సెటైర్లు వేశారు.

# రైతులకు రూ.50వేల రుణమాఫీ

**- అల్ప ఆదాయ రైతులకు 100 శాతం మాఫీ**

ఈ పథకంలో చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. రూ. 50,000 లోపు రుణం ఉన్న అల్ప ఆదాయ రైతులకు వంద శాతం రుణమాఫీని ప్రకటించింది. అంటే వారి అప్పు మొత్తం పూర్తిగా రద్దు కానుంది. ఇతర రైతులకు కూడా అదే స్థాయిలో 50 శాతం వరకు రుణమాఫీ వర్తించనుంది. రుణ మొత్తం పెరిగే కొద్దీ ప్రభుత్వం ఒక నిర్దేశిత మొత్తాన్ని మాఫీ చేస్తూ పట్టికను విడుదల చేసింది. గరిష్టంగా లక్ష రూపాయలకు పైగా రుణం ఉన్నవారికి కూడా రూ. 5,000 వరకు రాయితీ కల్పించారు.

**- సాగు రంగానికి సరికొత్త ఊతం**

పంట రుణాల మాఫీ ద్వారా రైతులకు కొత్తగా రుణాలు పొందే అవకాశం కలుగుతుందని, ఇది రాబోయే సాగు సీజన్‌కు ఎంతో మేలు చేస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కేవలం అప్పులు రద్దు చేయడమే కాకుండా, వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆర్బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా, రాబోయే 45 నుండి 60 రోజుల్లోనే ఈ ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**- విజయ్ నిర్ణయంపై హర్షాతిరేకాలు**

సీఎం విజయ్ తీసుకున్న ఈ నిర్ణయంపై తమిళనాడు రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద రైతులకు ఈ పథకం ఒక వరమని అభిప్రాయపడుతున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే రైతుల పక్షపాతిగా విజయ్ గుర్తింపు పొందాలని చూస్తున్నట్లు ఈ పథకం ద్వారా స్పష్టమవుతోంది. ఈ నిర్ణయం రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో టీవీకే పార్టీకి మరింత మైలేజీని ఇస్తుందని భావిస్తున్నారు.

# అట్టహాసంగా
# పద్మ అవార్డుల ప్రదానోత్సవం

66 మంది గ్రహీతలకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అత్యున్నత పౌర పురస్కారాలను అందజేశారు. ఈ ప్రతిష్టాత్మక సివిల్ ఇన్వెస్టిచర్ వేడుకలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు పాల్గొన్నారు. సోమవారం రాష్ట్రపతి 2 పద్మ విభూషణ్, 6 పద్మ భూషణ్, 58 పద్మ శ్రీ అవార్డులను ప్రదానం చేశారు.?

పద్మ విభూషణ్ (మరణానంతరం): బాలీవుడ్ దిగ్గజ నటుడు, దివంగత ధర్మేంద్ర తరపున ఆయన సతీమణి, ఎంపీ హేమమాలిని రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మ విభూషణ్ పురస్కారాన్ని స్వీకరించారు. పద్మ భూషణ్: మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ అల్కా యాగ్నిక్ లు కళా రంగానికి చేసిన విశేష సేవలకు గాను పద్మ భూషణ్ అవార్డులను అందుకున్నారు.

ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకోవడం విశేషం. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రావుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

# జెన్-జీ కలల సాకారం

యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. విజయవాడలో సోమవారం నిర్వహించిన "ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026"లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గ్రామీణ ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేయడమే మా ప్రభుత్వ నినాదం. 'విలేజ్ టు గ్లోబల్ మార్కెట్' అనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మెటా, అమెజాన్ వంటి సంస్థలతో కుదిరిన ఒప్పందాలు ఈ లక్ష్య సాధనకు మార్గం సుగమం చేస్తాయి. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తాం" అని తెలిపారు. జెన్-జీ, జెన్-ఆల్ఫా తరం యువత కలలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందని ఆయన ఉద్ఘాటించారు.

**- కొత్త కార్యక్రమాలు, పార్కులకు శ్రీకారం**

ఈ సమ్మిట్‌లో భాగంగా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి ఊతమిచ్చే పలు కీలక కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. రూ.200 కోట్ల వ్యయంతో "ఏపీ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్"ను, రూ.300 కోట్లతో "ఆంధ్రప్రదేశ్ చీఫ్ మినిస్టర్స్ ఎంట్రప్రెన్యూర్ ప్రోగ్రామ్" ను ప్రారంభించారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా 38 ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. "ప్రతీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలన్నది మా లక్ష్యం. ఇప్పటికే 100 పార్కుల పనులు మొదలయ్యాయి. ఇవాళ మరో 38 పార్కులకు శంకుస్థాపన చేశాం. జూలై నాటికి మిగిలిన వాటిని కూడా పూర్తి చేసి, అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం. పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు భూములిచ్చిన రైతులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని చంద్రబాబు అన్నారు. 'సైనింగ్-గ్రౌండింగ్-ఓపెనింగ్' తమ ప్రభుత్వ విధానమని, ఒప్పందాలు చేసుకోవడమే కాదు, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసి, పరిశ్రమలను ప్రారంభించే వరకు నిరంతరాయంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు.

**- ఎంఎస్ఎంఈలకు అండగా ప్రభుత్వం**

వ్యవసాయం తర్వాత అత్యధిక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రంగం ఎంఎస్ఎంఈ అని, ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. "భారీ పరిశ్రమలు దేశానికి ప్రతిష్ఠ తెస్తే, ఎంఎస్ఎంఈలు లక్షలాది మందికి జీవనోపాధినిస్తాయి. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.558 కోట్ల ప్రోత్సాహకాలను ఇప్పటికే అందించాం. ఏపీఐఐసీలో పరిశ్రమలు స్థాపించే ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాం. త్వరలో 5 లక్షల మంది డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం" అని ప్రకటించారు.

**- 100 యూనికార్న్ కంపెనీలే లక్ష్యం**

ఆంధ్రప్రదేశ్‌ను ఇన్నోవేషన్ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తన ఆశయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. "ఏపీ నుంచి 100 యూనికార్న్ కంపెనీలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాం. ప్రధాని మోదీ ఇచ్చిన 'చిప్ టు షిప్' నినాదాన్ని నిజం చేసేలా తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాం. విశాఖ, అమరావతి, తిరుపతిలను ఆర్థిక జోన్లుగా అభివృద్ధి చేస్తూ, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నాం," అని వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, డీప్ టెక్ స్టార్టప్‌ల కోసం రూ.20 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసేందుకు సిడ్బీతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అంతకుముందు, విజయవాడలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళావేదికను సీఎం ప్రారంభించారు. ఈ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు రూపొందించిన ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం

పార్టీని ఒక సైనిక పటాలంలా ముందుకు నడిపించేందుకు కఠిన నిర్ణయాలు తప్పవని స్పష్టం చేశారు. రాజమండ్రిలో జరిగిన పార్లమెంటరీ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీలో ప్రక్షాళనకు శ్రీకారం చుడుతున్నట్లు సంచలన ప్రకటన చేశారు. దీనికి తొలి అడుగుగా, అంతర్గత కలహాలతో సతమతమవుతున్న ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రకాశం జిల్లా కమిటీలో తీవ్రమైన వర్గ విభేదాలు ఉన్నాయని, కేవలం 25 మంది సభ్యుల మధ్య ఏకంగా 54 గొడవలు ఉన్నాయని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్గత కలహాలతో ఒకరినొకరు పనిచేయనివ్వకుండా పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలో ఇలాంటి క్రమశిక్షణారాహిత్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పార్టీలో అందరికీ స్వేచ్ఛ ఇచ్చానని, కానీ ఇకపై తాను అనుకున్న పద్ధతిలోనే పార్టీని ముందుకు నడిపిస్తానని తేల్చిచెప్పారు. "ఒకే మార్గంలో నడవండి, లేదంటే పక్కకు తప్పుకోండి (ఫాల్ ఇన్ లైన్ ఆర్ ఫాల్ అవుట్ ఆఫ్ లైన్)" అంటూ గట్టిగా హెచ్చరించారు. ఈ నిర్ణయం ద్వారా పార్టీలో ఏ స్థాయి నేతలైనా క్రమశిక్షణ తప్పితే కఠిన చర్యలు తప్పవనే బలమైన సందేశాన్ని పవన్ పంపించారు. త్వరలోనే ప్రకాశం జిల్లాకు కొత్త కార్యవర్గాన్ని నియమించనున్నట్లు సమాచారం.

# డీఎస్సీలో అక్రమాలు..
# జగన్ ఆరోపణలు

ద్రోహం చేయలేదా? అని ప్రశ్నించారు.మీ సుపుత్రుడి శాఖలో లీకులతో సాగిన డార్క్ ఆపరేషన్‌ను ఎందుకు దాచి పెడుతున్నారని సీఎం చంద్రబాబు నాయుణ్ని జగన్ ప్రశ్నించారు. మెగా డీఎస్సీ.. మెగా లీక్ మెగా అవినీతికి బాధ్యత వహిస్తూ లోకేశ్‌ను విద్యాశాఖ మంత్రి పదవి నుంచి తప్పించాలని వెంటనే సీబీఐ దర్యాప్తు కోరాలని డిమాండ్ చేశారు. పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. డీఎస్సీ పరీక్ష నిర్వహణలో చురుగ్గా పాల్గొన్న ఎస్ఈఆర్టీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి డీఎస్సీలో ఫస్ట్ ర్యాంక్ ఎలా వచ్చిందని జగన్ ప్రశ్నించారు. వివరాలను డేటా బేస్ నుంచి ఎందుకు తొలగించారు? మెరిట్ లిస్టులను ఎందుకు దాచిపెట్టారు? టాపర్ల వివరాలను ఎందుకు తొలగించారని ప్రశ్నలు గుప్పించారు.కలెక్టర్ ఆఫీసుల్లో ఎంపికైన వారి జాబితాలు పెట్టకుండా నేరుగా ఎంపికైన వారికే మెసేజ్‌లు ఎందుకు పంపించారని జగన్ ప్రశ్నించారు. రూ.15 లక్షలకు స్పోర్ట్స్ కోటా పోస్టులను అమ్ముకున్నారు అన్నట్టుగా జగన్ తన ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. ఎప్పుడూ క్రీడా మైదానంలో అడుగుపెట్టని వాళ్లకు కూడా ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. టెటె కన్వీనర్‌గా ఉన్న అధికారి డీఎస్సీ ఎగ్జామ్ కన్వీనర్ అయినప్పటికీ అకస్మాత్తుగా టెట్ కన్వీనర్‌ను తొలగించి విద్యాశాఖలోని జాయింట్ కమిషనర్‌ను డీఎస్సీ కన్వీనర్‌గా ఎందుకు నియమించారని జగన్ ప్రశ్నించారు. దీని వెనుక మతలబు ఏంటో చెప్పాలన్నారు. చంద్రబాబు నాయుడికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రతిభ చూపిన అభ్యర్థులకు న్యాయం చేయాలని జగన్ సూచించారు.

# నీది మిషన్ మోడ్ కాదు..కమీషన్ మోడ్

రైతులు ఎండనక వాననక అరిగోస పడటం రాష్ట్ర చరిత్రలో ముందెన్నడూ చూడలేదన్నారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. "మొన్నేమో 90 లక్షల మెట్రిక్ టన్నులు కొంటామని చెప్పి, ఇప్పుడు కేవలం 70 లక్షల మెట్రిక్ టన్నులే కొంటాం అనడం ఎంతవరకు సబబు? రాష్ట్రంలో కోటి మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తే.. మిగిలిన 30 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతులు ఏం చేసుకోవాలి?" అని ప్రశ్నించారు. కేంద్రంపై నెపం నెట్టడం ఆపి, వారి మెడలు వంచైనా సరే ధాన్యం సేకరించాలని డిమాండ్ చేశారు. "తాలు పెడితే తోలు తీస్తా" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ క్షేత్రస్థాయిలో సిద్దిపేట నియోజకవర్గంలోనే క్వింటాల్‌కు ఏకంగా 5 కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసిందని, ఈ జాప్యం వల్ల వరి కుప్పలపైనే గుండెలు బాదుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 మంది రైతులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. ధాన్యాన్ని 'మిషన్ మోడ్'లో కొంటున్నామనే సీఎం వ్యాఖ్యలను తిప్పికొడుతూ.. ఇది మిషన్ మోడ్ కాదు, పూర్తిగా 'కమీషన్ మోడ్' అని ఆరోపించారు. నిన్న జరిగిన కేబినెట్ మీటింగ్‌లో ధాన్యం కొనుగోలుపై స్పష్టమైన నిర్ణయం వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలిందన్నారు. 45 రోజుల్లో రైతుబంధు నిధులు వేస్తామని దేవుడి మీద ఒట్టు వేసి, 60 రోజులు గడిచినా వేయకుండా మాట తప్పారని, రేవంత్ రెడ్డి కేవలం ఒక "పేపర్ టైగర్" మాత్రమేనని విమర్శించారు. ముఖ్యమంత్రి తన ఢిల్లీ ట్రిప్పులను పక్కనబెట్టి, కళ్లాల్లో ఉన్న వడ్లను తరలించడానికి లారీల ట్రిప్పులను పెంచాలని హితవు పలికారు. రాజకీయ విమర్శలు పక్కనబెట్టి రైతుల సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలు చూపాలని హరీశ్ రావు హెచ్చరించారు. ఒకటి రెండు రోజుల్లో కొనుగోళ్లలో మార్పు రాకపోతే, స్వయంగా తానే సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట నిరవధిక ధర్నాకు దిగుతానని స్పష్టం చేశారు. అలాగే వేలాది మంది రైతులతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్లను దిగ్బంధిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు.

# బెంగాల్‌లో అంకుశం సీన్లు

ఒకే ఘటనలో 20కి పైగా బాంబులు విసిరి ఆ ప్రాంతాన్ని యుద్ధభూమిగా మార్చేశాడు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న ఇతనిపై హత్యాయత్నం, దోపిడీ, అక్రమ ఆయుధాల సరఫరా వంటి అనేక కేసులు నమోదయ్యాయి. సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ హౌరాలో తన సామ్రాజ్యాన్ని నిర్మించుకోవాలని ఇతడు ప్రయత్నించాడు.

**- ముగిసిన డాన్ హవా**

చాలా కాలంగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న ఆకాష్ సింగ్‌ను ఈ నెల ఆరంభంలో ప్రత్యేక పోలీసు బృందాలు పక్కా ప్లాన్‌తో అదుపులోకి తీసుకున్నాయి. సాధారణంగా నేరగాళ్లను అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తారు. కానీ, ఆకాష్ సింగ్ పట్ల ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టడానికి, అలాగే ఇతర నేరగాళ్లకు ఒక గట్టి హెచ్చరిక పంపడానికి పోలీసులు పబ్లిక్ పరేడ్ నిర్వహించారు. ఒకప్పుడు ఏ వీధుల్లోనైతే తుపాకులు పట్టుకుని హల్చల్ చేశాడో, అదే వీధుల్లో ఆకాష్ సింగ్‌ను పోలీసులు అర్ధనగ్నంగా నడిపించారు. డాన్ అని పిలిపించుకున్న వ్యక్తి ప్రజల ముందు ఇలా నిలబడటం చూసి స్థానికులు ఆశ్చర్యపోయారు. పోలీసుల ఈ చర్యతో హౌరాలో నేరగాళ్ల ప్రాబల్యం తగ్గుతుందని, సామాన్యులకు భద్రతా భావం కలుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**- ఆకాష్ సింగ్ గ్యాంగ్ అందరికీ ఇదే ట్రీట్‌మెంట్**

పశ్చిమ బెంగాల్‌లోని హౌరా పోలీసులు కేవలం ఆకాష్ సింగ్‌ను మాత్రమే కాకుండా, అతడి ముఠాకు చెందిన మరో నలుగురు సహచరులను కూడా ఇదే రీతిలో వీధుల్లో ఊరేగించారు. హౌరాలోని మలిపంచ్‌ఘరా పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, పేలుళ్లకు పాల్పడిన ఆకాష్ సింగ్, సుమిత్ సింగ్, అంకిత్ సింగ్, మరో ఇద్దరు నేరస్థులను పోలీసులు వరుసగా నిలబెట్టి, అర్ధనగ్నంగా నడిపించుకుంటూ తీసుకెళ్లారు. నేరస్థుల పట్ల ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టడానికి మరియు చట్టం ముందు ఎవరూ డాన్ కాదు అని నిరూపించడానికి హౌరా పోలీసులు ఈ సామూహిక పరేడ్ నిర్వహించినట్లు తెలుస్తోంది. నేరం చేస్తే చట్టం ముందు మోకరిల్లక తప్పదు అనే సందేశాన్ని ఈ ఘటన స్పష్టం చేస్తోంది. నేరగాళ్లను కేవలం జైలుకు పంపడమే కాకుండా, వారి సామాజిక ప్రతిష్ఠను దెబ్బతీయడం ద్వారా నేరాల సంఖ్యను తగ్గించవచ్చని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఊరేగింపుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు బెంగాల్ వ్యాప్తంగా వైరల్ అవుతున్నాయి.

# రైతులు పండించిన
# ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

**- రైతులు పండించిన ప్రతీ గింజా కొనుగోలు చేస్తాం**

రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కారణంగా హామాలీలు తరలివెళ్లడంతో ఇక్కడ కొంత కొరత ఏర్పడిందని, అలాగే ఎండల కారణంగా మధ్యాహ్నం సమయంలో పని జరగడం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం సమీక్ష చేస్తున్నానని తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. మూసీ నిర్వాసితులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానికంగానే నివాసాలు మంజూరు చేస్తామన్నారు. ఈ విషయంలో పార్టీలు రాజకీయం చేయడం తగదన్నారు. మూసీ పునరుజ్జీవం చేసి అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**- మూసీ వల్ల యువతకు ఉపాధి దొరుకుతుంది**

మూసీ కాలుష్యం వల్ల నల్గొండ జిల్లా ప్రజలకు జీవన్మరణ సమస్యగా మారిందని, అక్కడ ఎదురవుతున్న పరిస్థితులను సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు వల్ల యువతకు ఉపాధి లభించడమే కాకుండా నగర ప్రజల జీవన విధానం మెరుగవుతుందని చెప్పారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తున్నామని, చేపడుతున్న కార్యక్రమాలను వారికి వివరించారు. నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, అందులో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, భోజనం అందిస్తున్నాం అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ, ఆరుట్ల పాఠశాలను ఒకసారి సందర్శించాలని సీపీఎం నాయకులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పి. సుదర్శన్, జ్యోతి, నున్నా నాగేశ్వరరావు, మల్లు లక్ష్మి, సామినేని స్వరాజ్యం, ఎం. గోపాలరావుతో పాటు రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

**- కార్మికుల కనీస వేతనాల పెంపు నిర్ణయంపై సీపీఐ హర్షం**

మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సీపీఐ ప్రతినిధి బృందం సమావేశమైంది. సీపీఐ శాసన సభ్యుడు కూనమనేని సాంబశివ రావు నేతృత్వంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ని కలిశారు. కార్మికులకు కనీస వేతనాల పెంపు నిర్ణయంపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రైతుల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినప్పటికీ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చిందని అన్నారు. కేంద్రం మొక్కజొన్న కొనుగోలు చేయడం లేదని చెప్పారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా రైతులు ఇబ్బందులు పడొద్దని మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ ఎమ్మెల్సీ సత్యం గారు, నాయకులు పశ్య పద్మ , ఈ. నరసింహ, చాడ వెంకట్ రెడ్డి, బాగం హేమంతరావు, శంకర్, బాల నరసింహ, వీఎస్ బోసు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ఉన్నారు.

# భూదాన్ స్కామ్‌లో పొలిటికల్ లింకులు.?




హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ గతంలోనే ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసు విచారణలో భాగంగా ఇదివరకు 2024లోనే అమోయ్ కుమార్‌ను ఈడీ అధికారులు పలుమార్లు సుదీర్ఘంగా ప్రశ్నించి ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. తాజాగా ఈ నెల 25న వ్యక్తిగతంగా విచారణకు రావాలంటూ ఈడీ సమన్లు జారీ చేయడంతో ఆయన హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్నారు.అమోయ్ కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో మహేశ్వరం పరిధిలోని సుమారు 42 ఎకరాల విలువైన భూదాన్ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారనేది ప్రధాన ఆరోపణ. ఈ భూముల బదలాయింపు ప్రక్రియలో పెద్ద మొత్తంలో అక్రమంగా నిధులు, డబ్బు చేతులు మారినట్లు బలమైన ఆధారాలు లభించాయి. ముఖ్యంగా 22-ూ (నిషేధిత భూముల జాబితా) లో ఉన్న ఈ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రైవేట్ వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్లు చేయించడం ద్వారా అమోయ్ కుమార్ భారీగా ఆర్థిక లబ్ధి పొందారని ఈడీ అనుమానిస్తోంది. నాడు ధరణి పోర్టల్ వేదికగా ఈ భూములకు సంబంధించి రాత్రికి రాత్రే మార్పులు చేర్పులు జరగడం, నిషేధిత జాబితాలోని భూములకు రిజిస్ట్రేషన్ పూర్తి కావడం ఆ వెంటనే కొత్త పాస్ పుస్తకాలు జారీ కావడం వంటి అంశాలపై అటు రాష్ట్ర పోలీసులు, ఇటు ఈడీ అధికారులు సంయుక్తంగా దృష్టి పెట్టారు. అమోయ్ కుమార్ హయాంలో జరిగిన సేల్ డీడ్లు 1209, 1212, 4594 లలో భారీ ఎత్తున నిబంధనల ఉల్లంఘనలు, అవకతవకలు జరిగాయని ఈడీ ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారించింది. ఈ క్రమంలోనే కేసు దర్యాప్తును తదుపరి దశకు తీసుకెళ్లేందుకు వీలుగా ఆయనను మరోసారి విచారిస్తూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. అయితే ఈ భూముల వ్యవహారం వెనుక కేవలం అధికారులే కాకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని కొందరు కీలక పెద్దల హస్తం, పాత్ర కూడా ఉందనే ప్రచారం గట్టిగా సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈనాటి విచారణలో ఐఏఎస్ అధికారి నుంచి ఈడీ ఎలాంటి కీలక రహస్యాలు, రాజకీయ లింకులను రాబట్టబోతోంది అనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయ, ఐఏఎస్ వర్గాల్లో సస్పెన్స్‌గా మారింది.

## ఘనంగా ముగిసిన
## బాల సంస్కార్ -2026 వేసవి శిభిరం




**హన్మకొండ మే 25:** బాల సంస్కార్ -2026 వేసవి శిభిరం ముగింపు వేడుక జయప్రదంశ్రీ రామకృష్ణ సేవ సమితి హనుమకొండ ఆధ్వర్యంలో నిర్వహించబడిన బాలసంస్కార్ - 2026 నేడు ముగింపు వేడుకతో జయప్రదమైంది. నేటి మాతృ పితృ పాదపూజ మహోత్సవంలో చిన్నారులు నేర్చుకున్న యోగ-ధ్యానం, సాంస్కృతిక ప్రదర్శనలు, సంస్కృత భాష అధ్యయనం,శ్లోక గీతి తదితర అంశాలను సూక్ష్మంగా ప్రదర్శించడం జరిగింది. సమితి అధ్యక్షులు కటంగురు సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభు చైతన్య సంస్కృత అధ్యాపకులు పేట శ్రీనివాస్ స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో నేటి వేడుక ప్రారంభమైంది.నాయిని విశాల్ ట్రస్ట్ ధర్మకర్త దేవన విష్ణువర్ధన్ రెడ్డి ప్రత్యేక అతిథిగా విచ్చేసి వివేకానంద నాబోటి యువతకు స్ఫూర్తి ప్రదాత యని, వారిని ఆదర్శంగా తీసుకున్న బాల-బాలికలు జీవితంలో తప్పకుండా విజయం సాధిస్తారని, చిన్నారుల విన్యాసాలు, ప్రదర్శించిన అంశాలు మనసుకు ఆకట్టుకునేలా ఉన్నాయని అన్నారు.పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర గూర్చి ప్రముఖ మానసిక నిపుణులు శివప్రసాద్ ప్రధాన వక్తగా హాజరై పిల్లల పోషకులకు మార్గదర్శనం చేశారు. సమితి ఆశయాలను కార్యక్రమాలను వాటి నిర్వహణ అవశ్యకత గురించి అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి వివరించారు. ప్రభు చైతన్య మాట్లాడుతూ పిల్లల్లో సంస్కారాలు నింపాలంటే తల్లి ఒక భక్తురాలిగా తండ్రి ఒక యోగిలా గురువు ఒక జ్ఞానిలా ఉన్నప్పుడే పిల్లలను సంస్కారవంతులుగా తీర్చిదిద్దగలరని అన్నారు. నేడు సాహితీ-సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన విజేతలకు, ప్రదర్శనలు చేసిన చిన్నారులకు జ్ఞాపికలను, మూర్తిత్రయ భావజాల సాహిత్యాన్నిబహుకరించారు. సేవా సమితి క్రియాశీల సభ్యులు చిదర అంజనీ దేవి, పడిదల అనిత, పూలమ్మ, లక్ష్మీదేవి, లక్ష్మి రావు, కె.వి.రావు, సూర్య, కార్యకర్తలు అనిల్, రఘు, నరేష్ శ్రీకాంత్, గణేష్, పిల్లల తల్లి-తండు)లు, తదితర పరిసర కాలనీల వాసులు సుమారు 250 మంది ఈ కార్యక్రమాలు పాల్గొన్నారు. చివరగా ప్రసాద పంపిణీ జరిగింది.

## కోహెడ గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత

**రంగారెడ్డి** కోహెడ గ్రామంలో సోమవారం నాడు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫ్రూట్ మార్కెట్ కు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు కేటాయిస్తామంటూ గ్రామానికి అధికారులు వచ్చారు.దాంతో స్థానికులు, రైతులు అధికారులపై తిరుగుబాటు చేసారు. అధికారులకు, రైతులకు మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. జేసీబీ ముందుకు వెళ్లకుండా రోడ్డుపై పడుకుని వృద్ధురాలు నిరసనకు దిగింది. ఆర్డీవో, ఎమ్మార్వో, మార్కెట్ కమిటీ చైర్మన్ ను రైతులు రైతులు అడ్డుకున్నారు. మండుటెండలోనూ నిరసన చేపట్టారు. ఉద్రిక్తత నేపథ్యంలో కోహెడ గ్రామంలో భారీగా పోలీసుల మోహరింపు జరిగింది.

### తెలంగాణలో ఓబెన్ రోర్ ఈ బైక్‌కు మంచి స్పందన

**హైదరాబాద్** ఎలక్ట్రిక్ మోటార్సైకిల్ కంపెనీ ఓబెన్ ఎలక్ట్రిక్.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో తన కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. విస్తరణలో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో కొత్తగా 20 షోరూమ్లను ఏర్పాటు చేయటంతో పాటు ఏపీలో మరో 10 షోరూమ్స్ను ప్రారంభించనున్నట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ హర్షవర్ధన్ దేశ్ముఖ్ తెలిపారు. ప్రస్తుతం కంపెనీ తెలంగాణలో ఐదు, ఏపీలో 4 షోరూమ్స్ను నిర్వహిస్తోందన్నారు. కాగా కంపెనీ ఇటీవల మార్కెట్లోకి తీసుకువచ్చిన ఓబెన్ రోర్ ఇవోకి ఇక్కడి మార్కెట్లో మంచి స్పందన లభిస్తోందన్నారు. ఈ ఎలక్ట్రిక్ బైక్ బుకింగ్స్ ప్రారంభించిన 15 రోజుల్లోనే దేశవ్యాప్తంగా 25,000కు పైగా బుకింగ్స్ రాగా ఇందులో హైదరాబాద్ నుంచి 2,000కు పైగా బుకింగ్స్ వచ్చాయన్నారు. 3.4 కేడబ్ల్యూహెచ్ ఎల్ఎ?ఫపీ బ్యాటరీతో కూడిన ఈ బైక్ ఒకసారి చార్జింగ్తో 180 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని చెప్పారు. జూన్ నుంచి డెలివరీ ప్రారంభించనున్న రోర్ ఇవో ధర రూ.1,24,999 (ఎక్స్షోరూమ్) అని దేశ్ముఖ్ తెలిపారు. బెంగళూరులో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ప్లాంట్లో రోర్ బైక్ను ఉత్పత్తి చేస్తున్నట్లు దేశ్ముఖ్ చెప్పారు.

## గో వధను అరికట్టాలి

**హైదరాబాద్:** తెలంగాణలో బక్రీద్ సందర్భంగా గోవధలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఈరోజు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ను కలవనున్నారు. సోమవారం ఉదయం 11:30 గంటలకు రాజ్ భవన్ (లోక్ భవన్)లో గవర్నర్ను కలిసి రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ ఓల్డ్ సిటీలో పెరుగుతున్న గోహత్యల అంశంపై వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.గో సంరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని, గోవులను అక్రమంగా తరలించడం మరియు వధించడం నివారించేందుకు పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామని విశ్వహిందూ పరిషత్ నాయకులు పేర్కొన్నారు. ఓల్డ్ సిటీలో డంప్ చేసిన గోవులను వెంటనే విడిపించాలని కూడా డిమాండ్ చేశారు.గత మూడు నెలలుగా గో సంరక్షణ అంశంపై ఉద్యమం కొనసాగిస్తున్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం స్పందించడం లేదని విశ్వహిందూ పరిషత్ ధర్మాచార్య ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఆరోపించారు. బక్రీద్ సందర్భంగా గోవులను వధించడం సరికాదని, గో సంరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు

### ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన సదస్సు.

**రుద్రవరం**మండల వ్యవసాయ అధికారి జి సుమతి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం మండలంలోనికోటకొండ గ్రామంలో ఖరీఫ్ సీజన్ లో ఎల్ నీనో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉన్నందువలన రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని డాక్టర్ సహదేవరెడ్డి ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఆర్ ఏ ఆర్ ఎస్ మార్టేరు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఈ సీజన్ లో వర్షాలు తక్కువగా ఉండడం వలన వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ కాల పరిమితి బెట్టను తట్టుకోగల పంటలైన ఆపరాలు పప్పు దినుసులు పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వరి సాగు చేసే రైతులు ముందుగా జీలుగా జనము లేదా పిల్ల పెసర పిఎండిఎస్ కిట్లను భూమిలో వేసి కలదున్ని భూసారాన్ని పెంచుకోవాలని తెలిపారు. వరిలో విచక్షణారహితంగా ఎరువులు వాడకం తగ్గించి తగు మోతాదులో ఎరువుల యాజమాన్యం చేపట్టినట్లయితే తక్కువ ఖర్చుతో అదిక ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చు అని తెలిపారు.

అలాగే తెజెస్వర్ రావు శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతులు సంఘటితంగా ఏర్పడి వ్యవసాయం చేయడం వలన మార్కెట్ ధరలను సొంతంగా నిర్ణయించుకొని మంచి లాభాలు పొందవచ్చు అని తెలిపారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ మంజునాథ్ ఆర్ ఎ ఆర్ఎస్ నంద్యాల మాట్లాడుతూ వివిధ రకాల పంటలలో వచ్చే చీడపీడల యాజమాన్యం వాటి పైన నివారణ చర్యల గురించి రైతులకు వివరించడం జరిగినది. రైతులు తప్పనిసరిగా డ్రోన్ సేవలు వినియోగించుకోవాలని కోరారు. శాస్త్రవేత్తల బృందం సమన్వయ కర్త డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిన వెంటనే మేలైన విత్తన ఎంపిక ముఖ్యమని విత్తనం మంచిదైతే పంట దిగుబడులు బాగుంటాయని రైతులకు తెలిపారు.జిల్లా వనరుల కేంద్రం నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ చెన్నయ్య మాట్లాడుతూ గతంలో వ్యవసాయం ఇప్పటికీ జరుగుతున్న వ్యవసాయం గురించి వాటి తారతమ్యాలు పంట మార్పిడి వంటి వాటిపై రైతులకు సలహాలు సూచనలు అందించడం జరిగినది. రైతులు మొక్కజొన్న బదులు సోయా చిక్కుడు ఆముదం వంటి పంటలను వేసుకోవాలని సూచించారు .జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సమగ్ర పంటల యాజమాన్యం రైతులు వ్యవసాయం మీదనే ఆధారపడకుండా పసు పోషణ కోళ్ల పెంపకం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి రాజు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉమాదేవి గ్రామ పెద్దలు జంగిటి రాజు, వెంకటపతి గ్రామ రైతులు పాల్గొన్నారు.

# జమాయమ్మ జగ్గారెడ్డి క్రికెట్టోర్నమెంట్

**- సీజన్2విజేతలకుబహుమతుల ప్రదానం**
**- ఎన్‌జీసీసీ టీ జే ఆర్ సంగారెడ్డి జట్టుకు రూ.1 లక్ష బహుమతి అందజేసిన నిర్మలా జగ్గారెడ్డి**

**సంగారెడ్డి మే 25** సంగారెడ్డి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో వారం రోజులుగా కొనసాగిన "జమాయమ్మ జగ్గారెడ్డి క్రికెట్ టోర్నమెంట్?సీజన్ 2" ఘనంగా ముగిసింది. స్థానిక యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌కు క్రీడాభిమానుల నుంచి విశేష స్పందన లభించింది.ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిర్మల జగ్గారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఎన్‌జీసీసీ టీ జే ఆర్ సంగారెడ్డి జట్టు విజేతగా నిలిచి రూ.1 లక్ష నగదు బహుమతిని కైవసం చేసుకోగా, రన్నరప్‌గా నిలిచిన నిరంజన్?11 పటాన్‌చెరు జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి అందజేశారు.అదేవిధంగా టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ విభాగాల్లో ప్రత్యేక నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. కౌన్సిలర్ ఫైజ్ బావజీర్ పర్యవేక్షణలో, నిర్వాహకులు సర్ఫరాజ్, అజర్, ఫహీం, యబా, ఇమ్రాన్ సమన్వయంతో పోటీలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి."క్రీడలు యువతకు క్రమశిక్షణ నేర్పిస్తాయి"ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, ఆటల్లో గెలుపు?ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యమని పేర్కొన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రమశిక్షణ, సమయపాలన వంటి విలువలు క్రీడల ద్వారా అలవడతాయని ఆమె అన్నారు.ఇండోర్ స్టేడియానికి రూ.10 కోట్లు×సంగారెడ్డిలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి జగ్గారెడ్డి సహకారంతో రూ.10 కోట్ల నిధులు మంజూరైనట్లు నిర్మల జగ్గారెడ్డి వెల్లడించారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్ కుమార్, వైస్ చైర్మన్ హాఫీజ్ షేక్ షఫీ, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, నిర్వాహకులు, యువకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

**- యువజన & క్రీడల శాఖ 99 రోజుల కార్యాచరణకు రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన**
**- యువత శక్తికి దిశా నిర్దేశం చేసిన "యువజన ఽ క్రీడల వారోత్సవాలు"క్రీడలు**
**- నైపుణ్యం నాయకత్వం ఉపాధి ఆరు రోజుల మహోత్సవం విజయవంతం**




**హైద్రాబాద్** తెలంగాణ ప్రభుత్వం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నిర్వహించిన 99 రోజుల కార్యాచరణలో యువజన ఽ క్రీడల శాఖ చేపట్టిన "యువజన ఽ క్రీడల వారోత్సవాలు" రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన పొందాయి.మే 18 నుండి 23 వరకు నిర్వహించిన ఈ ఆరు రోజుల కార్యక్రమాలు యువతలో శారీరక దారుఢ్యం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడమే కాకుండా క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేశాయి.రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో యువజన సేవలు మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు నిర్వహించగా యువజన సంఘాలు, క్రీడాకారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు మరియు సాధారణ ప్రజలు భారీగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.మే 18"ఫిట్ ఽ యాక్టివ్ తెలంగాణ"తో ఉత్సాహభరిత ఆరంభంవారోత్సవాల తొలి రోజు "ఫిట్ ఽ యాక్టివ్ తెలంగాణ" పేరిట రాష్ట్రవ్యాప్తంగా మారథాన్‌లు, వాక్‌థాన్‌లు, యోగా, ధ్యానం, ఏరోబిక్స్, జుంబా కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి.హైదరాబాద్ ఎల్.బి. స్టేడియంలో జరిగిన 5 కిలోమీటర్ల మారథాన్‌కు యువత పెద్ద సంఖ్యలో హాజరైంది. జిల్లా కేంద్రాల్లో మారథాన్‌లు, మండల కేంద్రాల్లో వెల్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించగా కలెక్టర్లు, ఎస్పీలు, ప్రజాప్రతినిధులు స్వయంగా పాల్గొని యువతను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.మే 19కెరీర్ ఽ నైపుణ్యాభివృద్ధి దినోత్సవంయువతకు ఉపాధి దిశగా మార్గనిర్దేశం చేయాలనే లక్ష్యంతో నైపుణ్యాభివృద్ధి కోర్సులు, స్పోర్ట్స్ యూనివర్సిటీ అవకాశాలు, స్కిల్ యూనివర్సిటీ ప్రోగ్రాములు, అగ్నివీర్ నియామకాలపై రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ప్రత్యేక వర్చువల్ సెషన్‌లు నిర్వహించారు.విద్యార్థులు, యువత భారీగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డాక్టర్ సోనీ బాలాదేవి పాల్గొని "ఫిజికల్ లిటరసీ" ప్రాధాన్యంపై చేసిన సందేశం యువతలో చైతన్యాన్ని నింపింది.×మే 20×యువజన నాయకత్వ సమ్మేళనం×లో యువత ఆలోచనలకు వేదికయువతలో నాయకత్వం, సృజనాత్మకత, సామాజిక అవగాహన పెంపొందించేందుకు "యూత్ లీడర్‌షిప్ సమ్మిట్" మరియు "యువజన పార్లమెంట్ సమావేశాలు" నిర్వహించారు.విద్యాసంస్థలు, యువజన సంఘాల భాగస్వామ్యంతో జరిగిన ఈ కార్యక్రమాల్లో యువత సామాజిక అంశాలపై చర్చలు జరిపింది.సోషల్ మీడియా ప్రభావం, క్రీడల ద్వారా నైపుణ్యాల పెంపుదల, కుటుంబం కెరీర్ సమతుల్యత, యువతకు అందుబాటులో ఉన్న క్రీడా అవకాశాలపై విద్యార్థులు, యువకులు చర్చాగోష్టులు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.మే 21"ప్లే ఽ పార్టిసిపేట్ ? స్పోర్ట్స్ డే"రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్టేడియాలు, క్రీడా మైదానాల్లో క్రీడా మరియు వినోద కార్యక్రమాలు నిర్వహించి యువతలో సామూహిక భాగస్వామ్యాన్ని పెంపొందించారు.జిల్లా యువజన మరియు క్రీడాధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో యువత, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.స్పోర్ట్స్ అథారిటీ ఎండీ డాక్టర్ సోనీ బాలాదేవి స్వయంగా క్రీడల్లో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించడం విశేషంగా నిలిచింది.మే 22"సర్వ్ ఽ సపోర్ట్"తో స్వచ్ఛ తెలంగాణకు యువత అంకితంయువతలో సామాజిక బాధ్యత పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.క్రీడా మైదానాలు, పార్కులు, చెరువులు, ఓపెన్ ప్రదేశాల్లో యువజన స్వచ్ఛంద సేవకులు, క్రీడాకారులు, ఎన్‌జీవోలు, ప్రజాప్రతినిధులు కలిసి శ్రమదానం చేశారు.ఎల్.బి. స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ డాక్టర్ సోనీ బాలాదేవి పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.మే 23"ఉద్యోగ సాధన"తో వేలాది యువతకు అవకాశాలువారోత్సవాల చివరి రోజు యువతకు ఉపాధి అవకాశాలపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించారు.మే 1 నుండి 12 వరకు వివిధ జిల్లాల్లో నిర్వహించిన జాబ్ మేళాల్లో దాదాపు 40 వేల మంది యువకులు నమోదు చేసుకోగా, 22 వేల మందికి పైగా ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.ఇందులో 11,200 మంది అభ్యర్థులు షార్ట్‌లిస్ట్ కాగా, దాదాపు 5,700 మందికి వివిధ సంస్థల నుండి నియామక పత్రాలు అందజేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదేవిధంగా వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు.రాష్ట్రవ్యాప్తంగా విజయవంతమైన నిర్వహణ33 జిల్లాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాలు జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల సమన్వయం, యువజన సంఘాలు, క్రీడా సంఘాలు, విద్యార్థుల చురుకైన భాగస్వామ్యంతో విజయవంతమయ్యాయి.ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడలు మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి అధికారులు, సిబ్బందిని అభినందించారు.యువతే తెలంగాణ భవిష్యత్తు అనే నినాదానికి అర్థవంతమైన రూపం ఇచ్చిన ఈ వారోత్సవాలు యువ శక్తిని సమాజాభివృద్ధి దిశగా మళ్లించిన స్ఫూర్తిదాయక కార్యక్రమాలుగా నిలిచాయి.

# ఇంధన ధరల పెంపుతో సామాన్యులు గగ్గోలు

**రాయచోటి** ఇంధన ధరలు పెంచడంతో సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. 10 రోజుల్లో మూడు దఫాలు ఇంధన ధరలు పెంచడంతో సామాన్యులు నడ్డి విరుగుతోం దని విమర్శించారు.సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో శ్రీకాంత్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు..పెట్రోల్, డీజిల్ ధరలు అమాంతం పెరిగిపోతూ సామాన్య ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెడుతున్నాయని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ముడి చమురు ధరల పెరుగుదలతో పాటు ప్రభుత్వాలు విధిస్తున్న భారీ పన్నుల భారం ప్రజలపై మోపడం దారుణమన్నారు.ఇంధన ధరల పెరుగుదల ప్రభావంతో రవాణా ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, దీనివల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులుఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పది రోజుల వ్యవధిలోనే నాలుగు సార్లు ఇంధన ధరలు పెంచడం ప్రజలపై ఆర్థిక భారం మోపడమేనన్నారు.మే 15న పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.3 చొప్పున పెంచగా, మే 19న పెట్రోల్‌పై 95 పైసలు, డీజిల్‌పై 97 పైసలు, మే 23న పెట్రోల్‌పై 97 పైసలు, డీజిల్‌పై 99 పైసలు, మే 25న తాజాగా పెట్రోల్‌పై రూ.2.87, డీజిల్‌పై రూ.2.85 పెంచారని వివరించారు. మొత్తంగా పది రోజుల్లోనే పెట్రోల్ ధర లీటరుకు రూ.7.79, డీజిల్ ధర రూ.7.81 పెరిగిందని తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లోనే దేశంలో అత్యధిక ఇంధన ధరలు ఉన్నాయని, పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలోనే పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు రూ.10 వరకు ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు కూటమి ప్రభుత్వం మద్దతు ఇస్తూ ప్రజలపై మరింత భారం మోపుతోందని మండిపడ్డారు.పొరుగు రాష్ట్రాల మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇంధన ధరలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని, కేంద్ర?రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న పన్నులను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు చమురు కొరత ఉండదు.. ధరలు పెరగవు అంటూ హామీలు ఇచ్చిన ప్రభుత్వాలు, నేడు వరుసగా ధరలు పెంచుతూ ప్రజలను మోసం చేస్తున్నాయని ధ్వజమెత్తారు.ధరలు తగ్గించాలని ఇదివరకే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టి, ప్రభుత్వానికి విన్నవించినా కానీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోక, వరుసగా ధరలను పెంచుకుంటూనే పోతున్నారన్నారు.దీనివల్ల ప్రజలపై మరింత భారం పడుతుందన్నారు.ప్రజల ఆవేదనను ప్రభుత్వం వెంటనే గుర్తించి ఇంధన ధరల పెంపును ఉపసంహరించు కోవాలని, లేనిపక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారువి ఆర్ ఓల సంఘ రాష్ట్ర నాయకుడు మద్దిరాల హేమానాధ రెడ్డి ఇటీవల రెండు మోకాలి చిప్పల మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రం గాలివీడులో ఆయనను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.గాలివీడు మండలం పందికుంట గ్రామం బత్తినవాండ్లపల్లెకు చెందిన ధర్మారెడ్డి కుమారుడికి ఇటీవల వివాహం అయింది. ఈ సందర్భంగా ఆదివారం బత్తినవాండ్లపల్లె కు వైఎస్ఆర్ సీపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి వెళ్లి నూతన వధూవరులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం బత్తిన ఇరగంరెడ్డి నివాసంలో శ్రీకాంత్ రెడ్డి తేనీటి విందు స్వీకరించారు.లక్కిరెడ్డిపల్లె మండలం దిన్నెపాడు గ్రామం నరసింహారాజుగారిపల్లె నివాసి, సబ్ స్టేషన్ ఉద్యోగి చిట్రాజు ఆనంద రాజు గుండె పోటుతో ఇటీవల మృతి చెందారు. నరసింహారాజుగారిపల్లె లో ఆనంద రాజు కుటుంభాన్ని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. అతని చిత్ర పటం వద్ద శ్రద్ధాంజలి ఘటించి, సంతాపం తెలిపి, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంభానికి తోడుగా ఉంటామని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.లక్కిరెడ్డిపల్లె మండలం దిన్నెపాడు గ్రామం పర్వతరెడ్డిగారిపల్లె కు చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్త మండ్ల లక్ష్మినారాయణ తల్లి ఈశ్వరమ్మ మృతి చెందారు.పర్వత రెడ్డిగారిపల్లె కు వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్



రెడ్డి వెళ్లి ఈశ్వరమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.లక్కిరెడ్డిపల్లె మండలం దిన్నెపాడు గ్రామంలోని పర్వతరెడ్డిగారిపల్లె లలో ప్రజలు,యువత వైఎస్ఆర్ సిపి కార్యకర్తలు,నాయకులతో వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి మమేకమయ్యారు. సమిష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందామని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.పార్టీ కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టి, వేధించారని దూదేకుల పల్లె, వడ్డెపల్లె లకు చెందిన వారు శ్రీకాంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.అక్రమ కేసులకు భయపడవద్దని, న్యాయపోరాటం చేద్దామని , ధైర్యంగా ఉండాలని వారికి శ్రీకాంత్ రెడ్డి భరోసానిచ్చారు

# రైతు వెంటే బీజేపీ.. చివరి గింజ కొనేవరకు పోరాటం

**వరంగల్‌లో రేవంత్ చెప్పిన రైతు న్యాయం ఎక్కడ.?**

**గజ్వేల్ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ రైతులకు బేడీలు వేసిన చరిత్ర ఆయనది**

**- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ రైతులకు బేడీలు వేసిన చరిత్ర కలిగిన వ్యక్తి అని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు తీవ్ర విమర్శలు చేశారు. "ఇద్దరూ రైతు ద్రోహులే" అంటూ మండిపడ్డారు.బీజేపీ రైతు భరోసా యాత్రలో భాగంగా గజ్వేల్ మార్కెట్‌కు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతులతో మమేకమై వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సహకారం అందడం లేదని, ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు బీజేపీ నాయకులకు వివరించారు. రైతులకు "మేమున్నాం" అనే భరోసాను బీజేపీ నేతలు కల్పించారు.బీజేపీ నేతలు వస్తున్నారనే సమాచారం తెలిసిన వెంటనే అధికారులు హుటాహుటిన ధాన్యాన్ని తరలించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. "ఇన్ని రోజులు ప్రభుత్వం నిద్రపోయిందా..? నెల రోజులుగా రైతులు కన్నీరు మున్నీరవుతుంటే పాలకులు ఏమి చేస్తున్నారు.?" అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డి, రామారావు పటేల్, హరీష్, బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ రావు, ఎల్లో రాంరెడ్డి, కుడికెల రాములు, బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాలుగో వార్డ్ కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్, రొట్టెల రాందాస్, అశోక్, ఐలయ్య, తిరుపతిరెడ్డి, సంపత్ రెడ్డి, రామ్ రెడ్డి, సత్యం, లక్ష్మణ్, వెంకట్ గౌడ్, జానకిరామ్, పోచయ్య, వెంకట్ రెడ్డి, సందీప్, వెంకటేష్ శివకుమార్ లతో పాటు జిల్లా, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లిఫ్ట్ ఇస్తామని నమ్మించి దోపిడీ

## కారు, మొబైల్ ఫోన్లతో నిందితులు అరెస్ట్




గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా: గౌరారం రాజీవ్ రహదారిపై ప్రయాణికులను లక్ష్యంగా చేసుకుని లిఫ్ట్ పేరుతో దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను గౌరారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి చోరీ సొత్తుతో పాటు నేరానికి ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు.ఉత్తరప్రదేశ్‌కు చెందిన శశి రంజన్ సింగ్ ఈ నెల 22న రాత్రి ప్రజ్ఞాపూర్ బస్‌స్టాప్ వద్ద సికింద్రాబాద్ వెళ్లేందుకు వేచి ఉండగా, సిద్దిపేటకు చెందిన వొలుసుల అలీఖేష్ తన ముగ్గురు మైనర్ సహచరులతో కలిసి కారులో లిఫ్ట్ ఇస్తామని నమ్మబలికి ఎక్కించుకున్నారు. అనంతరం గౌరారం శివారులోని ముట్రాజ్‌పల్లి చౌరస్తా వద్ద బాధితుడిని బెదిరించి బ్యాగ్, రూ.200 నగదు, వివో మొబైల్ ఫోన్ లాక్కొని కారులోంచి తోసివేసి పరారయ్యారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, సీసీ కెమెరాలు మరియు సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఎన్సానపల్లికి చెందిన రాజు వద్ద నుంచి ఖా08+ఔ8840 నంబర్ గల స్విఫ్ట్ డిజైర్ కారును రోజుకు రూ.3,500కు సెల్ఫ్ డ్రైవింగ్‌కు తీసుకున్నట్లు విచారణలో తేలింది.ప్రధాన నిందితుడు అలీఖేష్‌పై గతంలో గంజాయి, రాత్రి దొంగతనాల కేసులు ఉండగా, మరో మైనర్ నిందితుడిపై పోక్సో కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.నిందితుల నుంచి స్విఫ్ట్ డిజైర్ కార్, బాధితుడి మొబైల్, బ్యాగ్, నగదు, అలాగే మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడిని రిమాండ్‌కు తరలించగా, మైనర్లకు కారు ఇచ్చిన యజమాని రాజుపై కూడా మోటార్ వెహికిల్స్ చట్టం కింద కేసు నమోదు చేశారు.సెల్ఫ్ డ్రైవింగ్ వాహనాలు కిరాయికి ఇచ్చే యజమానులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, గుర్తింపు పత్రాలు పరిశీలించి మాత్రమే వాహనాలు ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు హెచ్చరించారు.

## ముత్యపుపందిరిపై భక్తులను కటాక్షించిన శ్రీ గోవిందరాజస్వామి

**దివ్య ముత్యకాంతుల్లో ఆధ్యాత్మిక ప్రశాంతత నింపిన గోవిందుడు**



తిరుపతి(ప్రశ్న న్యూస్) శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారు ముత్యపుపందిరి వాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చి అభయానుగ్రహాలు ప్రసాదించారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన వాహనసేవలో గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాలు, వేదఘోషల నడుమ తిరుపతి మాడవీధులు భక్తిరసంతో పరవశించాయి.నిత్యాలంకార ప్రియుడైన శ్రీనివాసుడు ప్రతిరోజూ భిన్న అలంకారాలలో భక్తులను అలరిస్తుంటాడు. ముత్యపుపందిరిపై వెలసిన స్వామివారి దివ్య మంగళవిగ్రహం భక్తులకు అపారమైన ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించింది. జ్యోతిషశాస్త్రంలో చంద్రునికి ప్రతీకగా భావించే ముత్యం చల్లదనానికి, శాంతికి సంకేతం. సముద్రగర్భం ప్రసాదించిన అమూల్య రత్నాలైన ముత్యాల కాంతుల మధ్య నిలిచిన శ్రీహరి దర్శనం భక్తుల తాపత్రయాలను తొలగించి, జీవితాల్లో ప్రశాంతతను, సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుందనే విశ్వాసం భక్తుల్లో వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి, టిటిడి డిప్యూటీ ఈవో వి.ఆర్. శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, ఏవీఎస్వో ఆర్. శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు శేషగిరి, చిరంజీవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయరావు, రంజిత్, పలువురు అధికారులు, శ్రీవారి సేవకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గోదావరి నది కాలుష్య నియంత్రణ పై ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమీక్ష సమావేశం

**కాలుష్యరహిత గోదావరి పుష్కరాలు' నిర్వహణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**గోదావరిలో కలిసే కాలుష్య జలాలపై సమగ్ర ఆడిట్ చేపట్టాలి**



రాజమహేంద్రవరం (ప్రశ్న న్యూస్) 'గోదావరి నదిలోకి కలిసే కాలుష్యకారక వ్యర్థాలు, జలాలు, వాటి నిర్వహణపై పూర్తిస్థాయి ఆడిట్ చేపట్టి నివేదిక ఇవ్వండి. ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏమిటి..? భవిష్యత్తులో చేయబోయే పనుల మీద స్పష్టమైన ప్రణాళికను సిద్ధం చేయండి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఉన్నత అధికారులు, తూర్పు గోదావరి జిల్లా అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను 'కాలుష్యరహిత గోదావరి' థీమ్ తో సాకారం చేసి నిర్వహించడానికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 6 గం.కు పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరం పుష్కరాల ఘాట్ నుంచి కోటిలింగాలు ఘాట్ వరకు పడవలో ప్రయాణించి గోదావరి జలాల కాలుష్యకారక ప్రాంతాలని పరిశీలించారు. పుష్కరాల్లో చేయాల్సిన పనుల తీరు, త్వరలో చేపట్టబోయే పనుల ప్రణాళికను స్వయంగా పరిశీలించారు. గోదావరి గట్ల సుందరీకరణ పనులు ఎంతవరకు వచ్చాయనేది, పుష్కరాల నేపథ్యంలో గట్లను ఎలా తీర్చిదిద్దబోతున్నది అధికారులు వివరించారు. ఈ సందర్భంగా చింతలమ్మ ఘాట్ వద్ద నల్లా ఛానల్ ద్వారా రాజమహేంద్రవరం మురుగునీరు గోదావరిలోకి కలిసే ప్రాంతాన్ని పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు. నది తీరంలో జరుగుతున్న కాలుష్యం తీరును స్వయంగా చూశారు. నీటిని ఎలా శుద్ధి చేస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న సిబ్బందితో మాట్లాడి వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని చూశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ అధికారులకు ఆదేశాలిస్తూ "గోదావరిలోకి రోజువారీ సుమారుగా 55 ఎం. ఎల్. డి. (మిలియన్ లీటర్స్ పర్ డే) మురుగునీరు వస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ మురుగు నీటిని శుద్ధి చేసే విధానం శాస్త్రీయంగా జరగాలి. మురుగు నీటిని నేరుగా గోదావరిలోకి వదలడం వల్ల జలాలు కలుషితం అవుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై దృష్టి సారించాలి.

## వైకాపాను శాశ్వతంగా పాతాళానికి పంపుతాం

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



గత వైకాపా పాలనలో కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తల వేధింపుకోటబొమ్మాళి(ప్రశ్న న్యూస్) గత వైకాపా పాలనలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే వారిని కమీషన్ల పేరుతో వేధించి భయభ్రాంతులకు గురిచేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "నాకెంత నీకెంత" అంటూ పారిశ్రామికవేత్తలను భయపెట్టడం వల్లే వారు ఈ రాష్ట్రానికి దండం పెట్టి వెనుదిరిగారని ఆయన మండిపడ్డారు. టెక్కలి నియోజకవర్గం, కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు గ్రామ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం రూ. 10.51 కోట్ల వ్యయంతో, 12.22 ఎకరాల విస్తీర్ణంలో 74 ప్లాట్లతో నూతనంగా అభివృద్ధి చేయనున్న ఎంఎస్ఎంఈ (మీవీజు) పార్కుకు ఆయన శంకుస్థాపన చేశారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఎంఎస్ఎంఈ (మీవీజు) పార్కులు విప్లవాత్మక సోపానాలుగా నిలుస్తాయని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా 38 పార్కులకు వర్చువల్ విధానంలో శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు గత ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## మాట నిలబెట్టుకున్న మంత్రి నారాయణ

**బలిజ భవన్, చర్చిలకు భారీ విరాళం**



నెల్లూరు (ప్రశ్న న్యూస్) నారాయణ.హామీ ఇచ్చిన రోజుల వ్యవధిలోనే 14 వ డివిజన్ లోని బలిజభవన్ కి 25 లక్షలు,50 వ డివిజన్ బుజ్జమ్మ రేవులోని జెమ్స్ ఆఫ్ జీసెస్ చర్చి కి 2 లక్షలు సొంత నిధి నుంచి కేటాయించారు.అందుకు సంబంధించిన చెక్కులను మెడికల్ కాలేజ్ లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కుమార్తె షరణి బలిజభవన్ కమిటీ సభ్యులు,చర్చి పాస్టర్ లకు సోమవారం అందచేసారు.అనంతరం షరణి మీడియాతో మాట్లాడారు.సిటీ నియోజకవర్గం ప్రజలు తన తండ్రిని అత్యధిక మెజారిటీతో గెలిపించారని, నగర అభివృద్దే ధ్యేయంగా ప్రజా రుణం తీర్చుకునేందుకు ఆయన నిరంతరం కృషి చేస్తూ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారన్నారు. నెల్లూరు సిటీ ప్రజలకు ఎల్లప్పుడూ తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు.ఇచ్చిన మాట ప్రకారం నాన్నగారి ఆదేశాలతో నారాయణ విద్యాసంస్థల తరఫున బలిజ భవన్‌కు 25 లక్షలు, జెమ్స్ ఆఫ్ జీసెస్ చర్చి అభివృద్ధికి 2 లక్షల విరాళాల చెక్కులను అందచేసినట్టు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు తమ కుటుంబ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, అందరూ సంతోషంగా ఉండాలన్నదే తమ అభిమతమని షరణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ భవన్ కమిటీ సభ్యులు డివీఎస్ గిరి, పసుపులేటి రామ్మూర్తి, గుణుకుల మల్లయ్య, రావి హనుమంతరావు, లక్ష్మణరావు, జెమ్స్ ఆఫ్ జీసెస్ చర్చి పాస్టర్ జెరోమ్, 50వ డివిజన్ ప్రెసిడెంట్ సిద్ధయ్య ఇతర టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## మహానాడు విజయవంతం చేయండి గౌత శిరీష



పలాస (ప్రశ్న న్యూస్ )నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయం నుండి పలాస నియోజకవర్గం పరిధిలో తెలుగుదేశం కుటుంబ సభ్యులుతో మహానాడు సమావేశం పై కాన్ఫరెన్స్ కాల్ నిర్వహించడం జరిగింది.ఈనెల 27. 28 తేదీలలో వర్చువల్ గా క్లస్టర్ పరిధిలో జరగబోయే మహానాడులో తెలుగుదేశం పార్టీ క్లస్టర్ కన్వీనర్లు కోకన్వీనర్లు యూనిట్ కన్వీనర్లు యూనిట్ కోకనుర్లు, బూత్ కన్వీనర్లు, బూత్ కో కన్వీనర్లు, మండల పెద్దలు, గ్రామ అధ్యక్షులు కార్యదర్శులు, కె ఎస్ ఎస్ లు వివిధ హోదాలో ఉన్న పెద్దలు, ఇతర నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు.ఈ కాన్ఫరెన్స్ కాల్ లో పలాస కాశీబుగ్గ మునిసిపాలిటీ, పలాస మండలం, వజ్రపుత్తూరు మండలం, మందస మండలాల ముఖ్య నాయకులు 10 క్లస్టర్ల యొక్క క్లస్టర్ కన్వీనర్లు, కోకన్వీనర్లు, యూనిట్ కన్వీనర్లు,యూనిట్ కో కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, బూత్ కో కన్వీనర్లు,ఖూూ లు మండల నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న పెద్దలు,కార్యకర్తలు ఇతరులు పాల్గొన్నారు.

## శత ప్రశ్న శరసంధానం గ్రంథం ఆవిష్కరణ

**హైదరాబాద్** షిర్డీ సాయిబాబాపై ఇటీవల కాలంలో పలువురు వ్యక్తులు చేస్తున్న వివిధ ఆరోపణలకు స్పష్టతనిస్తూ, ప్రామాణిక ఆధారాలతో సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి రచించిన "శత ప్రశ్న శరసంధానం" గ్రంథాన్ని ఘనంగా ఆవిష్కరించారు. నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా జరిగింది. షిర్డీ సాయిబాబా జీవితం, బోధనలు, ఆధ్యాత్మిక పరంపరపై వస్తున్న సందేహాలు, విమర్శలు మరియు ఆరోపణలకు సమాధానంగా ఈ గ్రంథాన్ని సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. "శత ప్రశ్న శరసంధానం" పేరుతో రూపొందించిన ఈ పుస్తకాన్ని సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి మొత్తం 11 భాషల్లో రచించడం విశేషం. భక్తుల్లో నెలకొన్న అనేక సందేహాలకు చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రామాణిక ఆధారాలతో సమగ్ర వివరణ ఇవ్వడమే ఈ గ్రంథం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ షిర్డీ సాయి దేవాలయాల నిర్వాహకులు, ట్రస్టు సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సాయి మందిరాల ప్రతినిధులు మాట్లాడుతూ, సాయిబాబాపై అసత్య ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి ప్రసంగిస్తూ, ఏ ఆధ్యాత్మిక మహానుభావుడి గురించి అయినా అవగాహన లేకుండా విమర్శలు చేయడం సమాజంలో అయోమయానికి దారితీస్తుందని అన్నారు. సాయిబాబా జీవితం మానవత్వం, సేవాభావం, సమానత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. భక్తుల సందేహాలకు సమగ్ర సమాధానంగా ఈ గ్రంథాన్ని సిద్ధం చేసినట్లు తెలిపారు. రమణేశ్వరంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా ముగిసింది.

**బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా**

## అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

**- పీజీఆర్ఎస్‌కు 309 దరఖాస్తుల స్వీకరణ**

**- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల,** ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, ఆర్డీఓలు తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను చివరి నిమిషం వరకు పెండింగ్‌లో ఉంచకుండా, ఎప్పటికప్పుడు పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని సూచించారు. చివరి సమయంలో అర్జీల పరిష్కారం చేపట్టడం వల్ల నాణ్యత తగ్గే అవకాశముందని పేర్కొన్నారు. అందువల్ల జిల్లాధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి సమర్థవంతమైన పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బియాండ్ ఎస్ఎల్ఏ పరిధిలో అర్జీలను పరిష్కరించిన శాఖల అధికారులను కలెక్టర్ వివరణ కోరారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 61,530 అర్జీలు స్వీకరించగా, అందులో 4,214 అర్జీలు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంకా పరిశీలించని 128 అర్జీలను వెంటనే ఓపెన్ చేసి పరిశీలించాలని ఆదేశించారు. రీఓపెన్ అర్జీల విషయానికొస్తే మొత్తం 5,310 అర్జీలు రీఓపెన్ కాగా, అందులో 5,113 అర్జీలను పరిష్కరించారని, ఇంకా 197 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని వారం రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో రీఓపెన్ శాతం 9.26 శాతంగా ఉందని, దాన్ని 5 శాతానికి తగ్గించేలా కృషి చేయాలని సూచించారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా అర్జీదారులతో సంబంధిత శాఖ అధికారులు చరవాణి ద్వారా మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించినప్పటికీ, విద్యుత్ శాఖ, పౌర సరఫరాల శాఖ, మున్సిపల్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, సెర్ప్, టిడ్కో, దేవాదాయ శాఖ, అటవీ శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ తదితర శాఖలు ఇప్పటివరకు నివేదికలు సమర్పించలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే అవసరమైన చర్యలు తీసుకుని నివేదికలు అందజేయాలని ఆదేశించారు."వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు ఆళ్లగడ్డలో రెండు విడతలుగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి విడతలో 578 దరఖాస్తులు, రెండవ విడతలో 561 దరఖాస్తులు స్వీకరించామని, వాటిని నాణ్యతతో పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## యాళ్లూరులో ప్రతిష్టాత్మక ఎం.ఎస్.ఎం.ఇ పార్కుకు శంకుస్థాపన చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ , జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**గోస్పాడు** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎం.ఎస్.ఎం.ఇ పార్కు" (రాష్ట్రవ్యాప్తంగా 175 ఎం.ఎస్.ఎం.ఇ ఇండస్ట్రియల్ పార్కులు) మరియు "ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త" పథకంలో భాగంగా, నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామంలో రూ. 16.40 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన ఎం.ఎస్.ఎం.ఇ పార్కుకు సోమవారం రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. స్థానిక యువతకు సొంత గ్రామాల పరిసరాల్లోనే ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే కాకుండా, ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత్తను తయారుచేయడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పన అత్యంత వేగంగా పూర్తి చేసి, త్వరలోనే పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ప్లాట్లను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు.జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఎం.ఎస్.ఎం.ఇ పార్కుల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని, యాళ్లూరు పార్కుకు సంబంధించి 9 ఎకరాల భూమి ఇప్పటికే ఏపీఐఐసీ ఆధీనంలో ఉందని తెలిపారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా మౌలిక వసతుల కల్పనను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# రైతుల ఫిర్యాదు తో రంగంలోకి దిగిన ఇరిగేషన్ అధికారులు

**- తడగొండలో బంధం కుంట భూములపై ఇరిగేషన్ శాఖ విచారణ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, తడగొండ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 435లో ఉన్న బంధం కుంటకు చెందిన 6.18 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని గ్రామానికి చెందిన పలువురు రైతులు ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇరిగేషన్ ఈఈకి రైతులు వినతి పత్రం అందజేశారు. ఫిర్యాదును పరిశీలించిన అధికారులు గతంలో బోయినిపల్లి తహశీల్దార్ సూచనలతో సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్‌ల ద్వారా ప్రాథమిక విచారణ చేపట్టించారు. అనంతరం సంబంధిత నివేదికను ఇరిగేషన్ శాఖ ఈఈ కార్యాలయానికి పంపించారు. ఈ నేపథ్యంలో ఈఈ ఆదేశాల మేరకు సోమవారం ఇరిగేషన్ డి ఈ తడగొండ గ్రామానికి చేరుకొని బంధం కుంట పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక రైతుల వివరాలు సేకరించి భూముల పరిస్థితిని పరిశీలించిన అనంతరం పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి పంపించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని డి ఈ తెలిపారు.

# ప్రజావాణి కి క్యూ కడుతున్న ప్రజలు

## ప్రజావాణిలో 184 ఫిర్యాదులు, పరిష్కారం అయ్యేనా.?

మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణికి విశేష స్పందన లభించింది. ఇందులో 184 దరఖాస్తులు ద చేసుకున్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను డిఆర్ఓ చంద్రావతి తో కలిసి అదనపు కలెక్టరు (184) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల



కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ భీమేశ్వర స్వామివారి సేవలో కేటీఆర్ తనయుడు హిమాన్షు


**- స్నేహితులతో కలిసి కోడె మొక్కు చెల్లించిన కేసీఆర్ మనుమడు**



వేములవాడ (ప్రశ్న న్యూస్)ప్రఖ్యాత శైవక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని భీమేశ్వర స్వామి ఆలయంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనుమడు,కేటీఆర్ కుమారుడు హిమాన్షు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తన స్నేహితులతో కలిసి ఆలయానికి చేరుకున్న హిమాన్షు ముందుగా స్వామివారికి కోడె మొక్కును చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో అభిషేక కార్యక్రమంలో పాల్గొని భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వాదాలు అందజేశారు. ఆలయ ఈఓ రమాదేవి స్వామివారి తీర్థ ప్రసాదాలను హిమాన్షుకు అందించారు. ఆలయానికి వచ్చిన భక్తులు హిమాన్షును చూసేందుకు ఆసక్తి కనబరిచారు.

# విలాసాగర్ చెరువులో అక్రమ నల్లమట్టి తవ్వకాలపై బీజేపీ ఫైర్

- నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు - రవాణా
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని ప్రకృతి సంపదను కాపాడాలి
- లేని యెడల తీవ్రంగా ఆందోళనలు చేపడుతాం
- బీజేపీ మండలాధ్యక్షులు : ఎడపల్లి పరశురాం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ పెద్ద చెరువులో జరుగుతున్న నల్లమట్టి తవ్వకం, రవాణాపై బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ నాయకత్వంలో స్థల పరిశీలన చేపట్టారు. ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా అధిక మొత్తంలో మట్టి తరలింపుతో పాటు అనుమతించిన లోతుకంటే ఎక్కువగా తవ్వకాలు జరుగుతున్నాయని నాయకులు ఆరోపించారు. అనుమతి లేని వాహనాలతో మట్టి రవాణా చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. పరిశీలన సమయంలో కొన్ని వాహనాలు అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోవడం అనుమానాలకు తావిచ్చిందన్నారు. దీనిపై అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసి కాంట్రాక్టర్‌తో పాటు అక్రమ రవాణాలో పాల్గొన్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమాలను అరికట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు మెరుపుల గంగాధర్ గౌడ్, రాజేంద్రప్రసాద్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి, సీనియర్ నాయకులు కొండం శ్రీనివాస్ రెడ్డి, పెంచాల మహేష్, మండల సోషల్ మీడియా కన్వీనర్ భాస్కర్ రెడ్డి, బూత్ అధ్యక్షులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ వైపు నేతల ఆకర్షణ


- పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు
- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం
- ఎమ్మెల్యే సత్యం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేత ముదుపు మల్లారెడ్డి
- బోయినిపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న బలం



బోయినిపల్లి / గంగాధర (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని కోరెం గ్రామానికి చెందిన ప్రముఖ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ముదుపు మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం సమక్షంలో సోమవారం ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మల్లారెడ్డికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు కొమ్మనబోయిన సువీన్ యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు వెన్నెల రమణ రెడ్డి, నాయకులు అజయ్, పులి హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ముదుపు మల్లారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాయకత్వంలో, మండల అధ్యక్షుడు సువీన్ యాదవ్ సహకారంతో కోరెం గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సత్యం ఆశీస్సులతో పార్టీ బలోపేతానికి, ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తా

- కాంగ్రెస్ పార్టీ నూతన మండలాధ్యక్షులు
- కొమ్మనబోయిన సువీన్ యాదవ్
- బోయినిపల్లి మండలంలో సువీన్ యాదవ్‌కు గ్రామాల వారిగా ఘన సన్మానం - శుభాకాంక్షలు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కొమ్మనబోయిన సువీన్ యాదవ్‌కు మండలంలోని మల్లాపూర్, మాన్వాడ, కొత్తపేట గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఘన సన్మానం నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా మండల పర్యటనకు వచ్చిన ఆయనకు గ్రామాల్లో ఆత్మీయ స్వాగతం లభించింది. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆశీస్సులతో పార్టీ బాధ్యతలు చేపట్టిన సువీన్ యాదవ్‌ను ఆయా గ్రామాల కాంగ్రెస్ శ్రేణులు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించాయి. ఈ ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు రామిడి శ్రీనివాస్,కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్ కార్పొరేటర్ వారాల నర్సింగం పాల్గొని నూతన మండల అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతకు ఆదర్శంగా నిలిచే విద్యావంతుడు, సేవా భావం కలిగిన నాయకుడు సువీన్ యాదవ్ నేతృత్వంలో బోయినిపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత చేరువయ్యేలా పనిచేయాలని ఆకాంక్షించారు. అనంతరం సువీన్ యాదవ్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తూ అందరినీ కలుపుకుని ముందుకు సాగుతానని చెప్పారు. మండల అభివృద్ధి, కాంగ్రెస్ పార్టీ బలోపేతం లక్ష్యంగా నిరంతరం ప్రజల్లోనే ఉంటానని,ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామాల వారీగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన సంబరాలు.. డ్రోన్‌తో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

- చొప్పదండి నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం
- గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి
- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం




గంగాధర (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం, కరీంనగర్ జిల్లా,గంగాధర మండల కేంద్రంలోని మధురానగర్ చౌరస్తాలో డిగ్రీ కళాశాల మంజూరుతో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా సంబరాలు జరుపుకున్నాయి. 2026 - 27 విద్యా సంవత్సరానికిగాను గంగాధర మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆమోదించినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి డ్రోన్ సహాయంతో వినూత్నంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ఏకైక లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావడంలో ఈ డిగ్రీ కళాశాల కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. డిగ్రీ కళాశాల మంజూరుతో గంగాధర మండల ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు.

# వేములవాడలో కలకలం రేపిన మహిళా మృతదేహం ఘటన

- గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం
- మృతురాలు వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలి
- వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ : వీరప్రసాద్



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్ స్టాండ్ సమీపంలో సోమవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. మృతురాలి వయస్సు సుమారు 25 నుండి 30 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పేర్కొన్నారు.ప్రాథమిక విచారణలో ఎండ తీవ్రత (సన్ స్ట్రోక్) కారణంగా మహిళ మృతి చెందిన అవకాశం ఉన్నట్లు భావిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.మృతురాలి వివరాలు, ఫోటోలను సంబంధిత పోలీస్ స్టేషన్లకు, మీడియాకు పంపించినట్లు సీఐ వీరప్రసాద్ పేర్కొన్నారు. మృతురాలు గురించి ఎవరైనా సమాచారం తెలిసిన వారు వెంటనే వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. సంప్రదించవలసిన వారు 8712656413 లో సంప్రదించాలని సీఐ కోరారు.

# అధికారిక ప్రకటనే ఆలస్యం



తమిళ అగ్రనటుడు, ఇళయ దళపతి విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే, ఆయన తాజా సినిమా 'జన నాయగన్' విడుదలకు అన్ని ఆటంకాలు తొలిగిపోయినట్టయింది. ఇక ఆ సినిమా విడుదల కోసం విజయ్ అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. లేటెస్ట్ బజ్ ప్రకారం ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్టు తెలుస్తున్నది. జూన్ 22న విజయ్ పుట్టినరోజు. కాబట్టి, జూన్ 19న సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ నిశ్చయించారట. ఇప్పటికే కొన్ని ఆన్‌లైన్ బుకింగ్ యాప్స్‌లో డేట్ వచ్చేసింది. ప్రస్తుతం అధికారిక ప్రకటన కోసం అంతా ఎదురుచూస్తున్నారు. తెలుగులో బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' చిత్రానికి రీమేక్‌గా ఈ చిత్రం రూపొందినట్టు వినికిడి. మమితా బైజు కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో పూజా హెగ్డే కథానాయిక. హెచ్ వినోద్ దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ పానిండియా చిత్రం తెరకెక్కింది.




# ఓటీటీలోకి ధనుష్ 'కర'..

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన తాజా రూరల్ యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ సినిమా 'కర' థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోపే ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకుంది. మే 28 (2026) నుండి ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారికంగా మేకర్స్ ప్రకటించారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో ఈ చిత్రం అందుబాటులో ఉండబోతుంది. మమితా బైజు (మలయాళ 'ప్రేమలు' ఫేమ్) ఇందులో కథానాయికగా నటించగా.. కేఎస్ రవికుమార్, జయరామ్, సూరజ్ వెంజరమూడు కీలక పాత్రల్లో నటించారు. విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇది 1991 గల్ఫ్ వార్ నేపథ్యంలో సాగే ఒక పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్. ఇందులో కరస్వామి అలియాస్ కర (ధనుష్) ఒక ప్రొఫెషనల్ దొంగ. తాను ప్రాణంగా ప్రేమించిన మల్లి (మమితా బైజు) కోసం ఆ నేర జీవితాన్ని వదిలేసి, సొంతంగా ఒక హోటల్ పెట్టుకుని బతకాలని అనుకుంటాడు. పెట్టుబడి కోసం తన ఊరిలో ఉన్న తాతల నాటి పొలం కాగితాలను బ్యాంకులో తాకట్టు పెట్టాలని ప్లాన్ చేస్తాడు. కానీ, కొన్ని అనుకోని పరిస్థితుల్లో ఆ పొలాన్ని బ్యాంకు జప్తు చేస్తుంది. దాంతో తన కుటుంబ ఆస్తిని కాపాడుకోవడానికి కర మళ్లీ దొంగగా మారాల్సి వస్తుంది. ఒకే బ్యాంకుకు చెందిన వివిధ బ్రాంచ్‌లలో బ్యాంక్ రాబరీలకు పాల్పడుతుంటాడు. ఆ తర్వాత ఏం జరిగింది అనేదే సినిమా కథ.

# యాక్షన్ మోడ్‌లోకి అక్షయ్



గత కొన్నేళ్లుగా వినోదప్రధానమైన చిత్రాలు, భావోద్వేగ కథలతో ఆడియన్స్‌ని అలరిస్తున్న బాలీవుడ్ సూపర్‌స్టార్ అక్షయ్‌కుమార్ త్వరలో యాక్షన్ మోడ్‌లోకి రానున్నారు. పూర్తిస్థాయి యాక్షన్ సినిమాలో ఆయన నటించి చాలా ఏళ్లయింది. ఆ లోటును భర్తీ చేస్తూ అక్షయ్ చేస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'సముక్'. కనిష్క్ వర్మ దర్శకుడు. విపుల్ అమృత్‌లాల్ షా నిర్మాత.దభారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనున్న ఈ సినిమా గురించి నిర్మాత మాట్లాడుతూ 'అక్షయ్ పూర్తిస్థాయి యాక్షన్ మోడ్‌లోకి తిరిగి వస్తున్నారు. ఇది ఓ ఏలియన్ సర్వైవల్ థ్రిల్లర్. హారర్ అంశాలతోపాటు, మిలిటరీ రియలిజం కూడా ఇందులో ఉంటాయి. అంతర్జాతీయ సాంకేతిక బృందం ఈ సినిమాకోసం పనిచేయబోతున్నది. 'సముక్' భారతీయ సినీ చరిత్రలో ఇంతకు ముందు రాని ప్రయత్నం' అని తెలిపారు.

## నా శరీరంలో మార్పులు చూసి..
## ప్లాస్టిక్ సర్జరీ అనుకున్నారు: అవికా గోర్


ఇటీవలే 'అగ్లీ స్టోరీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన కథానాయిక అవికా గోర్ ప్లాస్టిక్ సర్జరీలు, కాస్మోటిక్ ట్రీట్‌మెంట్లు చేయించుకుందంటూ సోషల్ మీడియాలో గాసిప్స్ వినిపిస్తున్నాయి. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఈ రూమర్లపై ఆమె స్పందిస్తూ ఫుల్ క్లారిటీ ఇచ్చింది. తమపై వస్తున్న సర్జరీ వదంతులను అవికా పూర్తిగా తోసిపుచ్చింది. "నేను ముఖంపై ఒక చిన్న ట్రీట్‌మెంట్ తీసుకున్న మాట వాస్తవమే. కానీ, అది అందం కోసం చేయించుకున్న సర్జరీ కాదు.. కేవలం నా ముఖంపై ఉన్న పింపుల్స్ (మొటిమలు) తగ్గించుకోవడానికి మాత్రమే. దురదృష్టవశాత్తూ అది కూడా సరిగా పనిచేయలేదు" అని వెల్లడించింది. నటిగా స్క్రీన్‌పై ప్రెజెంటబుల్‌గా కనిపించడం ముఖ్యం కాబట్టి, అవసరాన్ని బట్టి అప్పుడప్పుడు పార్లర్‌కు వెళ్లి బ్లడ్ సెల్స్ క్లీనింగ్, బైఫిషియల్ లాంటి సాధారణ ఫేషియల్స్ చేయించుకునేదాన్ని తప్ప ఎలాంటి కాస్మోటిక్ సర్జరీలు చేయించుకోలేదని స్పష్టం చేసింది.

"నాకు 7 ఏళ్ల వయసున్నప్పటి నుండే మేకప్ వేసుకోవడం అలవాటైంది. నా చర్మాన్ని కాపాడుకోవడానికి సన్‌స్క్రీన్ ఎక్కువగా వాడతాను. అసలు ఒక చిన్న టాటూ వేయించుకోవాలన్నా, కనీసం హెయిర్ కట్ చేయించుకోవాలన్నా మా అమ్మ పర్మిషన్ కావాలి..



అలాంటిది అంత పెద్ద సర్జరీలు నేను ఎలా చేయించుకోగలను?" అని అవికా ఎదురు ప్రశ్నించింది. శరీరంలో వచ్చిన మార్పులు, ఫిట్‌నెస్ గురించి మాట్లాడుతూ.. "నా శరీరతత్వం ఏంటంటే.. చాలా త్వరగా బరువు పెరుగుతాను. అంతే వేగంగా బరువు తగ్గుతాను. వయసు పెరిగే కొద్దీ అమ్మాయిల శరీరంలో సహజంగానే మార్పులు వస్తాయి. కానీ, నన్ను చిన్నప్పటి నుండి చూస్తున్న జనాలు ఆ మార్పులను గమనించి ప్లాస్టిక్ సర్జరీ అనుకుని పొరబడ్డారు" అని చెప్పింది. ఇండస్ట్రీలో సమంత, రష్మిక మందన్నా, పూజా హెగ్డే వంటి స్టార్ హీరోయిన్లు తమ బాడీని ఎంత పర్‌ఫెక్ట్‌గా మెయింటైన్ చేస్తారో చూసి తాను ఎంతో ఇన్‌స్పైర్ అయ్యానని, వారిలాగే తాను కూడా జిమ్‌లో కఠినమైన వర్కవుట్స్ చేస్తూ సహజంగానే బరువు తగ్గానని అవికా గోర్ క్లారిటీ ఇచ్చింది.

# వారణాసి... హైదరాబాదులో మహేష్ బాబుపై పాట చిత్రీకరణ!



సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న వారణాసి చిత్రంపై ఓ ఆసక్తికర అప్‌డేట్ వచ్చింది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కీలకమైన పాటను హైదరాబాద్‌లోని కాటేదాన్‌లో వేసిన ఓ భారీ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఇది కేవలం ఓ సాధారణ డ్యాన్స్ నంబర్ కాదని, కథను ముందుకు నడిపించే ముఖ్యమైన పాట అని తెలుస్తోంది. ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్ షూటింగ్‌ను ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని రాజమౌళి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పలు ప్రధాన షెడ్యూల్స్‌ను పూర్తి చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో నీటి కొరత కారణంగా, ముందుగా ప్లాన్ చేసుకున్న ఓ అండర్‌వాటర్ సీక్వెన్స్‌ను కూడా విజయవంతంగా చిత్రీకరించారు. ఈ సినిమాలో ప్రియాంకా చోప్రా మందాకిని పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర' అనే సాహస యాత్రికుడిగా కనిపించనుండగా, ఓ ప్రత్యేక ఘట్టంలో శ్రీరాముడి పాత్రలోనూ కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది. విలన్‌గా పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' పాత్రలో నటిస్తున్నారు. ఈ భారీ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. అయితే, ఈ షూటింగ్ వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది.

## ఆద్యంతం సంగీతభరితంగా
# సింగ్ గీతం



94ఏండ్ల వయసులో ప్రఖ్యాత దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన విభిన్న కథా చిత్రం 'సింగ్ గీతం'. భారతదేశపు తొలి మ్యూజికల్ ఫాంటసీగా రూపొందిన ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని వైజయంతీ మూవీస్ సమర్పణలో, స్వప్న సినిమా పతాకంపై నాగ్‌అశ్విన్ నిర్మించారు. ఒక దిగ్గజ దర్శకుడు, ఒక లెజెండరీ నిర్మాణ సంస్థ కలిసి రూపొందించిన ఈ చిత్రం ద్వారా అయాన్, అహల్య బమ్రూ, శాలిని కొండేపూడి ప్రధాన పాత్రధారులుగా పరిచయం అవుతున్నారు. జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం వైజాగ్‌లో ఈ సినిమాకు చెందిన ప్రత్యేక ఈవెంట్‌ని మేకర్స్ నిర్వహించారు. దేశంలో ఇప్పటివరకూ రాని కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందిందని, ఇంత గొప్ప సినిమాకు హీరోను కావడం తన అదృష్టమని హీరో అయాన్ అన్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల అహల్య బమ్రూ, శాలినీ కొండేపూడి ఆనందం వ్యక్తం చేశారు. ఈ చిత్రానికి సంగీతం అందించిన దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ 'సింగీతం సినిమాకు సంగీతం అందించడం నా అదృష్టం. అరుదుగా వచ్చే అవకాశం ఇది. ఇది కంప్లీట్ మ్యూజికల్ ఫిల్మ్. అంతా మనసుపెట్టి పనిచేశాం. సింగీతంగారికోసమైనా ఈ సినిమా తప్పక అంతా చూడాలి' అని పేర్కొన్నారు.

# దివ్యాంగ వితంతువుకు జీవనాధారం..

## జవహర్ నగర్ బాలాజీ నగర్ లో కిరాణా షాపు ప్రారంభం



**జవహర్‌నగర్(ప్రశ్న న్యూస్)**సామాజిక సేవలో ముందుండే సుఖినోభవంతు ట్రస్ట్, పవన్ బాబు మోహన్ చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తమ సేవా తత్వాన్ని చాటుకున్నాయి. జవహర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చంద్రపురి కాలనీ, బాలాజీనగర్‌లో ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న నిరుపేద దివ్యాంగ వితంతువు వరలక్ష్మికి స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో కిరాణా షాపును ఏర్పాటు చేసి సోమవారం ప్రారంభించారు. సుఖినోభవంతు ట్రస్ట్ చైర్మన్ రత్నప్రభ, పవన్ బాబు మోహన్ చారిటబుల్ ట్రస్ట్ కోఆర్డినేటర్ భాను రెడ్డిలు కలిసి సుమారు రూ.20 వేల విలువైన కిరాణా సామగ్రిని అందించి వరలక్ష్మి స్వయంగా ఉపాధి పొందేలా సహకరించారు. ఈ విషయాన్ని వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర జనరల్ సెక్రటరీ మెరుగు శివకృష్ణ ట్రస్ట్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి సహాయం అందించారు. ఈ సందర్భంగా మెరుగు శివకృష్ణ ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి కిరాణా షాపును ప్రారంభించారు. గతంలో కూడా ఈ ట్రస్ట్‌లు పేదలకు కుట్టుమిషన్లు, రైస్ బ్యాగులు, వికలాంగులకు వీల్‌చైర్లు, విద్యార్థులకు పుస్తకాలు అందించడంతో పాటు నిరుపేద కుటుంబాల వివాహాలకు పుస్తెమట్టెలు, దశదిన కర్మలకు అవసరమైన నిత్యావసర వస్తువులు అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. తనకు ఉపాధి కల్పించి ఆత్మవిశ్వాసాన్ని నింపిన మెరుగు శివకృష్ణ, రత్నప్రభ, భాను రెడ్డిలకు వరలక్ష్మి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుఖినోభవంతు ట్రస్ట్ సభ్యులు సత్యవతి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## సీమ ప్రజల కష్టాన్ని దోచుకున్న

# రాక్షసులు జగన్ కుటుంబ సభ్యులు

## - మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



మంగళగిరి (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండు సంవత్సరాల (24 నెలల) సుభిక్షమైన పాలనను పూర్తి చేసుకుంటున్న శుభసందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర రవాణా, యువజన సంక్షేమ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. భారతదేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీకి దక్కని అఖండ గౌరవాన్ని, బాధ్యతను ఆంధ్రరాష్ట్ర ప్రజలు తమకు కట్టబెట్టారని, దానికి తగ్గట్టుగానే రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "గత ఐదేళ్ల పాలనలో అదోగతి పాలైన రాష్ట్రాన్ని మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేవలం 24 నెలల్లోనే మళ్లీ గాడిలో పెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉన్నారు. ఇప్పటికే సుమారు రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం చుట్టి, యువత ఉపాధి కోసం మా ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తోందని తెలిపారు. "మన రాష్ట్రంలో తప్ప ఎక్కడా లేని ఒక విచిత్రమైన ప్రతిపక్ష నాయకుడు మనకు ఉన్నారు. ఆయన్ను 'హనీమూన్ నాయకుడు' అనడంలో ఎలాంటి సందేహం లేదు. గత 24 నెలల్లో ఆయన కేవలం 10 నుంచి 15 సార్లు మాత్రమే ప్రెస్ మీట్లు పెట్టారు. ఎప్పుడు బయటకు వచ్చినా, గత 40 ఏళ్ల నాటి పాత విషయాలనే పాత సారాయిని కొత్త సీసాలో పోసి మార్కెటింగ్ చేసినట్లు ప్రజలపై రుద్దడమే పనిగా పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిని జగన్ ఓర్వలేకపోతున్నారని విమర్శించారు.

## గౌతు కుటుంబంపై ఆరోపణలు వాస్తవ విరుద్ధం అభివృద్ధి పనులే సమాధానం: లొడగల కామేశ్వరరావు యాదవ్

**- మాటలు కాదు, అభివృద్ధే మా జవాబు: లొడగల కామేశ్వరరావు యాదవ్**



పలాస(ప్రశ్న న్యూస్) నియోజకవర్గంలో గౌతు కుటుంబంపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్య ప్రచారమని, ప్రజల మనసులు గెలుచుకోవడమే గౌతు కుటుంబం అసలైన సంపాదన అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అన్నారు. పలాస నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, గౌతు కుటుంబం ఎప్పుడూ ఎవరి ఆస్తులు దోచుకోలేదని, ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు.స్వర్గీయ గౌతు లచ్చన్న చిన్న రైతు కుటుంబం నుంచి ఎదిగి పలుమార్లు ప్రజా ప్రతినిధిగా ఎన్నిక కావడం ఆయన సేవాతత్వం, ప్రజల విశ్వాసానికి నిదర్శనమని ఆయన చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామ్‌సుందర్ శివాజీ కూడా పలాస--సోంపేట ప్రాంత ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నాయకుడని కొనియాడారు."గౌతు కుటుంబం డబ్బు సంపాదించలేదు.. ప్రజల మనసులు సంపాదించింది. వారు దోచుకున్నది ఎవరి ఆస్తులు కాదు, ప్రజల ప్రేమాభిమానాలు" అని కామేశ్వరరావు యాదవ్ అన్నారు.ప్రస్తుత ఎమ్మెల్యే గౌతు శిరీషమ్మ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నారని ఆయన తెలిపారు. ముఖ్యంగా రోడ్ల అభివృద్ధి విషయంలో గత పాలకులు నిర్లక్ష్యం చేసిన పలు ప్రాంతాలను ప్రస్తావిస్తూ, కేటి రోడ్డులోని టర్నింగ్ దగ్గర చిన్న భాగాన్నికూడా సరిచేయలేకపోయారని, ఇంద్ర చౌక్ వద్ద పాడైపోయిన రహదారి కూడా బాగు చేయలేకపోయారని విమర్శించారు. అలాగే ఎల్.సి. గేట్ అవతల బాలకృష్ణ హాస్పిటల్ ఎదురుగా ఉన్న రోడ్డు తీవ్రంగా దెబ్బతిన్నా దానిపై దృష్టి పెట్టలేదని అన్నారు. కానీ ఇప్పుడు తాళభద్ర గేట్ నుంచి కాశీబుగ్గ పెట్రోల్ బంక్ వరకు రహదారి అద్దంలా మెరిసేలా అభివృద్ధి చేయబడిందని పేర్కొన్నారు.పలాస ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ఎయిర్‌పోర్ట్ సాధన దిశగా కృషి జరుగుతోందని, "ప్రతి చేతికి పని" అనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని అన్నారు. అదేవిధంగా ఉత్తరాంధ్రకు వచ్చిన ఏకైక కేంద్రీయ విద్యాలయం పలాసాకు రావడంలో గౌతు శిరీషమ్మ కృషి కీలకమని పేర్కొన్నారు.ప్రతిపక్షాలు వాస్తవాలు మాట్లాడాలని, అభివృద్ధిపై సూచనలు ఇవ్వాలని, వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని కామేశ్వరరావు యాదవ్ సూచించారు. ముఖ్యంగా "అల్లుడు టాక్స్" వంటి పదజాలంతో చౌకబారు రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. అభివృద్ధి పనులు చేసిన వారిని అభినందించే సంస్కృతి రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆయన తో పాటు లేబర్ యూనియన్ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి, 27వ వార్డు మాజీ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ , కాశీబుగ్గ క్లస్టర్ కన్వీనర్ సవర రాంబాబు , సంపతిరావు సుధాకర్ , తారక రమేష్ , భరత్ తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

## డిప్యూటీ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన సిఐటియు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్ సుధాంశు కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి ఎం నరేష్ మాట్లాడుతూ గతంలో మేడ్చల్ గ్రామపంచాయతీ, మున్సిపల్, ఇప్పుడు జిహెచ్ఎంసి లో కలిసినా కానీ, కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడం చాలా బాధాకరం అని అన్నారు, గ్రామపంచాయతీ వర్కర్లుగా, మున్సిపల్ కార్మికులుగా ఇప్పుడు జిహెచ్ఎంసి కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు గత 6నెల్ల నుండి పీఎఫ్ డబ్బులు కట్టవుతున్న వారి అకౌంట్లో పడటం లేదనే విషయాన్ని గుర్తు చేశారు, ప్రొఫెషనల్ టాక్స్ పేరు మీద రూ. 535 నుండి టీడీఎస్ పేరు మీద 400 రూపాయలను జీతం నుండి కట్ చేయడం జరుగుతుందనే విషయాన్ని గుర్తు చేశారు, కార్మికులకు ఇచ్చే జీతాలే చాలి చాలని జీతాలు వాటి నుండి ప్రొఫెషనల్ టాక్స్ పేరు మీద టిడిఎస్ పేరు మీద కట్ చేస్తే కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని కాబట్టి వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.మేడ్చల్ సర్కిల్ పరిధిలో పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చెయ్యాలని,. కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలను ఇవ్వాలని జిహెచ్ఎంసి కార్మికులకు చెల్లిస్తున్న వేత్తనాలను మేడ్చల్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు 25 లక్షలు ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని 60 సంవత్సరాల వయసు పైబడిన కార్మికులను తొలగిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్స్ 10 లక్షలు, వారసులు లేని వారికి 15 లక్షలు ఇవ్వాలని ఆదివారాలు, పండుగ సెలవులు ఇవ్వాలను ఎస్.ఎఫ్.ఎ.లకు, జవాన్లకు వర్క్ ఇన్స్పెక్టర్లకు ప్రమోషన్లు కల్పించాలని సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి డబుల్ బెడ్ రూం లు , ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని బయోమెట్రిక్ అటెండెన్స్ విధానంలో మార్పులు చేయాలని, పని ప్రదేశాల వద్దనే వన్ టైం హాజరు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ సర్కిల్ కార్మికులు సిఐటియు నాయకులు ఎన్ .మల్లేష్, గణేష్, ఎం.మల్లేష్, రవి, లక్ష్మారెడ్డి, మధు, సంతోష్, రాజు, శ్రీకాంత్, రాము, ఎం .మహేష్, బిక్షపతి, శివ, లక్ష్మణ్, వెంకటయ్య స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# కదలిరండి పసుపు సైనికులారా



శ్రీకాళహస్తి (ప్రశ్న న్యూస్) టీడీపీ మహానాడు నేపథ్యంలో ఉద్వేగభరితమైన, స్ఫూర్తిదాయకమైన ప్రారంభమవుతుంది. తెలుగుజాతి తెలుగుదేశం పార్టీ నందమూరి తారకరామారావు నాటిన ఆశయాల మొక్క నేడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నారా లోకేష్ యువశక్తితో అఖండ వృక్షమై నిలిచింది. ఈ నేపథ్యంలో పసుపు దండు అంతా ఒకేచోట చేరి, తెలుగు ప్రజల భవిష్యత్తుకు సరికొత్త దిశానిర్దేశం చేసే అద్భుత ఘట్టం ఆసన్నమైంది కదలిరండి పసుపు సైనికులారా కరచాలనం చేయండి ప్రగతి శంఖారావానికి. తెలుగుదేశం పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమైన, పసుపు పండుగ మహానాడు ఈ నెల 27, 28 తేదీలలో అత్యంత వైభవంగా జరగబోతోంది ఈ సారి ప్రత్యేకత స్త్రీ శక్తి మహానాడు ఈ ఏడాది మహానాడు సరికొత్త చరిత్రకు వేదిక కాబోతోంది. ఈ సారి మన మహానాడును స్త్రీ శక్తి థీమ్ నిర్వహిస్తున్నాం. పార్టీ ఆవిర్భావం నుండి మహిళా సాధికారతకు, వారి హక్కులకు పెద్దపీట వేసిన తెలుగుదేశం పార్టీ, ఈ మహానాడు ద్వారా నారీ శక్తికి మరోసారి సమున్నత గౌరవాన్ని అందించబోతోంది కీలక నిర్ణయాలు ఆంధ్రప్రదేశ్, మరియు దేశవ్యాప్త ప్రయోజనాలే లక్ష్యంగా ముఖ్యమైన తీర్మానాలపై చర్చ ఆమోదం. నియోజకవర్గ బలాన్ని చాటిచెప్తూ ఈ మహానాడును చారిత్రాత్మక విజయవంతం చేయాలని మనస్ఫూర్తిగా పిలుపునిస్తున్నాను.జై తెలుగుదేశం జై జై తెలుగుదేశం జోహార్ ఎన్టీఆర్ వర్ధిల్లాలి చంద్రబాబు నాయుడు నాయకత్వం.

# అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

## - కలెక్టర్ గరిమ అగ్రవాల్



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సిరిసిల్ల సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మొత్తం దరఖాస్తులు 300 వచ్చాయి.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలలోనూ ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రాజేందర్ రెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 9 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 12 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సాధారణ బదిలీలో భాగంగా జిల్లాలోని 77 మంది పంచాయతీ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమక్షంలో జిల్లా పంచాయతీ రాజ్ అధికారులు ప్రక్రియను చేపట్టారు. మొత్తం 77 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి . వారికి నూతన గ్రామ పంచాయతీలను కేటాయించడం జరిగింది. కౌన్సెలింగ్ లో జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ బాధితులకు టీడీఆర్ ద్వారా న్యాయం చేయాలి : ఎన్‌సి సంతోష్



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ సి సంతోష్ మాట్లాడుతూ, గజ్వేల్ ప్రాంతాన్ని ఇటీవల హెచ్ఎండిఏ పరిధిలో చేర్చడం వల్ల రోడ్డు విస్తరణలో స్థలాలు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇది మంచి అవకాశమని అన్నారు.గతంలో టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) సర్టిఫికెట్లు కేవలం కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాలకే పరిమితం కావడంతో, గజ్వేల్ ప్రాంత బాధితులకు వాటి ప్రయోజనం అందలేదని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం అమల్లో ఉంచిన జీఓల ప్రకారం బాధితులకు మార్కెట్ విలువ కంటే నాలుగు రెట్లు వరకు లబ్ధి చేకూరే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో పాలకవర్గం సంబంధిత అధికారులతో చర్చించి, మున్సిపాలిటీలోని టీపీఎస్ సెక్షన్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, రోడ్డు విస్తరణలో నష్టపోయిన బాధితుల వివరాలను తక్షణమే సేకరించాలని డిమాండ్ చేశారు.అలాగే గతంలో నాయకులు ఇచ్చిన హామీల ప్రకారం రోడ్డు విస్తరణ బాధితుల ఇంటి నిర్మాణ, అభివృద్ధి విషయంలోనూ అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌సి సంతోష్ కోరారు.

# హెర్నియా క్లిష్ట శస్త్రచికిత్స విజయవంతం

## డాక్టర్ అన్నపూర్ణ సుప్రీండెంట్



### గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వైద్యుల ప్రతిభకు నిదర్శనం

గజ్వేల్( ప్రశ్న న్యూస్ )సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితిలో చేరిన యువతికి వైద్యులు విజయవంతంగా క్లిష్టమైన "అబ్స్ట్రక్టెడ్ ఇన్గ్విషనల్ హెర్నియా" శస్త్రచికిత్స నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా చింతలచెరువు గ్రామానికి చెందిన 29 ఏళ్ల అశ్విని తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రికి చేరుకోగా, పేగులకు రక్తప్రసరణ ఆగిపోవడంతో గ్యాంగ్రీన్ వచ్చే ప్రమాదం నెలకొంది.వెంటనే స్పందించిన వైద్య బృందం అత్యవసర శస్త్రచికిత్స చేపట్టి, పేగులు దెబ్బతినకుండా కాపాడింది. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు.ఈ శస్త్రచికిత్సలో జనరల్ సర్జన్ డా. ప్రేమ్, అనస్థీషియాలజిస్ట్ డా. మహిపాల్ కీలక పాత్ర పోషించగా, నర్సింగ్ ఆఫీసర్ సునీల్, ఓటీ టెక్నీషియన్స్ వెంకట్, రాజ్‌కుమార్, పేషెంట్ కేర్ సిబ్బంది రాజు, స్రా, సపోర్టింగ్ స్టాఫ్ యాదమ్మ సమయానికి స్పందించి సేవలందించారు.వైద్య బృందం సేవలను సూపరింటెండెంట్ డా. అన్నపూర్ణ, ఆర్ఎంఓ డా. రాము అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అత్యవసర క్లిష్ట కేసులకు నాణ్యమైన వైద్యం అందుతోందని ఈ ఘటన మరోసారి నిరూపించింది.

# ధర్మారెడ్డిపల్లిలో రైతుల ఆందోళన



## ధాన్యం కొనుగోలు చేయాలంటూ ధర్నా, రాస్తారోకో

గజ్వేల్ (ప్రశ్న న్యూస్)సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామ రైతులు సోమవారం భారీ ఎత్తున ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రైతులు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే ధాన్యం సేకరణ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఉన్న రైస్ మిల్లుల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే గ్రామాల్లోని ఫంక్షన్ హాళ్లు, రైతు వేదికల్లో ధాన్యం నిల్వ చేసే ఏర్పాట్లు చేయాలని కోరారు.రోహిణి కార్తె ప్రారంభమవడంతో ఎప్పుడైనా వర్షాలు పడే అవకాశం

# జిహెచ్ఎంసి ప్రజావాణిలో ప్రజల తిరుగుబాటు

**- "మాటలు కాదు.. పని చేయండి" అంటూ జిహెచ్ఎంసి అధికారులపై మండిపడ్డ ఫిర్యాదుదారులు**

**- అధికారులకు కాలక్షేపంగా మారిన ప్రజావాణి**

**- ఫిర్యాదుల స్వీకరణ తప్ప పరిష్కారం లేని కార్యక్రమం**

**- ఎన్నిసార్లు ఆఫీసుకు ఫిర్యాదు చేయాలి అంటూ ప్రశ్నించిన లాయర్ నాగిళ్ల శ్రీనివాస్**






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై ప్రజల ఆగ్రహం రోజురోజుకూ తీవ్రంగా పెరుగుతోందనే దానికి సోమవారం జరిగిన జిహెచ్ఎంసి ప్రజావాణి కార్యక్రమం ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. ఇప్పటికే నాలుగు నుంచి ఐదు సార్లు అంతకంటే ఎక్కువ ఫిర్యాదులు ఇచ్చినా జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తూ పలువురు ఫిర్యాదుదారులు ప్రజావాణిలోనే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోయినా "సాల్వ్ అయింది" అంటూ తప్పుడు మెసేజ్లు పంపిస్తున్నారని బాధితులు మండిపడ్డారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త, లాయర్ నాగిళ్ల శ్రీనివాస్ అధికారుల పనితీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ ప్రజావాణిలో కూర్చొని కూల్ డ్రింక్స్, స్నాక్స్ తింటూ ప్రజల సమస్యలు పట్టించుకోకుండా హేళన చేస్తున్నారు. పబ్లిక్ టాక్స్‌తో మీ జీతాలు వస్తున్నాయి. మేము నాలుగైదుసార్లు తిరిగిన మీరు పని చేయకుంటే మా ఓపిక ఎలా ఉంటుందో మీకు తెలుసా.? మాటలు బంద్ చేసి పని చేయండి" అంటూ ఉన్నత అధికారులను ప్రజలు నిలదీశారు.

### హైదరాబస్తీలో అక్రమ నిర్మాణాల దందా

సికింద్రాబాద్ కవాడిగూడ సర్కిల్ పరిధిలోని హైదరాబస్తీలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని నాగిళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకుని కమర్షియల్ భవనాలు నిర్మిస్తున్నారని, ప్రభుత్వ లీజ్ ల్యాండ్ స్థలాలలో ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది బిల్డర్లు జిహెచ్ఎంసి అధికారులను మేనేజ్ చేస్తూ ఫ్లోర్ వారీగా డబ్బులు ముట్టజెప్పి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.

### హైకోర్టులో కేసులు నడుస్తున్నా చర్యలు లేవు

జిహెచ్ఎంసిలో అవినీతి అధికారుల ముందు కోర్టు ఆదేశాలు కూడా పనిచేయడం లేదు కేవలం ధనార్జన లక్ష్యంగా కోర్టు ఆర్డర్లను పక్కనపెట్టి అధికారులు అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.
ప్రజలు ఫిర్యాదులు ఇస్తే అధికారులు సమస్య పరిష్కారం కాకముందే 'సాల్వ్ అయింది' అంటూ తప్పుడు మెసేజ్లు పంపుతున్నారు. ఇది మొత్తం ఒక గేమ్‌లా మారిపోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు. సాక్షాత్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ శాఖ పూర్తిగా అవినీతిమయం కావడంపై ముఖ్యమంత్రి అభిమానులు కూడా ఆంద్రుల వ్యక్తం చేస్తున్నారు.

### లంచాలకే అధికారుల మెతక వైఖరి..

జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ అధికారులు కిందిస్థాయి అధికారులపై చర్యలు తీసుకోకపోవడానికి జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఉన్న అధికారులకు లంచాలు అందుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. "కింద స్థాయి అధికారుల నుంచి వచ్చే మామూళ్లకు ఆశపడి జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ అధికారులు మెతక వైఖరి



అవలంబిస్తున్నారు. అందుకే అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు" అని నాగిళ్ల శ్రీనివాస్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సమస్యలు తీర్చాలని
ప్రజలు 10 నుంచి 15 సార్లు ప్రజావాణి చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ పాలన ఇలా కొనసాగితే ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుంది అని ఆయన హెచ్చరించారు.

### ఫోన్లు డిపాజిట్ చేయించడంపై అనుమానాలు..

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ప్రజావాణికి వచ్చే వారితో మొబైల్ ఫోన్లు డిపాజిట్ చేయిస్తున్నారని, దీనిపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. "ప్రజలు తిరగబడితే వీడియోలు బయటకు రాకూడదనే ఉద్దేశంతో ఫోన్లు తీసుకుంటున్నారు. ఆ గదిలో కెమెరాలు కూడా ఉండవు. ప్రజలకు పారదర్శకత ఎక్కడ.? అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం పారదర్శక పాలన అందించాలి కానీ దానిని మరిచి అధికారులు ఫోన్లు దాచి పెట్టడం వాళ్ళ అవినీతిని బయటకు రాకుండా అడ్డుకోవడం జరుగుతుందని మండిపడ్డారు. జిహెచ్ఎంసి కమిషనర్ ప్రజావాణికి అసలు రారని వచ్చిన ఒకరోజు ఏదో చిన్న ముచ్చటి చెప్పి వెళ్లిపోవడం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. ప్రధాన కార్యాలయంలో ఉన్న



మీడియా కూడా జిహెచ్ఎంసి లో జరుగుతున్న అక్రమాలను వెలుగులోకి తీసుకురాక పోవడం చూస్తుంటే బాధాకరంగా ఉందన్నారు.

### అధికారుల సస్పెన్షన్‌కు డిమాండ్..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ప్రతి మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ప్రజల ఫిర్యాదులను పక్కనపెట్టి అవినీతి అధికారులకు మూటలు కట్టడం ప్రభుత్వానికి తగదని ప్రభుత్వ పాలనపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. అవినీతికి అక్రమాలకు సికింద్రాబాద్ జోన్ జోనల్ కమిషనర్, జోనల్ సి పి, కవాడిగూడ సర్కిల్ సిబ్బంది, అధికారులు సహకరిస్తున్నారని ఆరోపిస్తూ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌తో పాటు సంబంధిత డిప్యూటీ కమిషనర్ పుష్పలతను వెంటనే సస్పెండ్ చేయాలని నాగిళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాలను కూల్చివేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. డిప్యూటీ కమిషనర్ పుష్పలత పూర్తి బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని పత్రికల్లో ఆమె అవినీతిపై కథనాలు వస్తే రిపోర్టర్లను కూడా బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. అధికారుల అవినీతిని ప్రశ్నించే మీడియాపై అధికారులు మండిపడడం విడ్డూరంగా ఉందన్నారు. అవినీతి చేసే అధికారులు జిహెచ్ఎంసిలో చాలామంది ఉన్నారని వాళ్లపై చర్యలు తీసుకునే దమ్ము కమిషనర్కు ఉందా అన్నారు.
ప్రజావాణిలో వినిపించిన ఈ ఆగ్రహ స్వరాలు ఇప్పుడు జిహెచ్ఎంసి పాలనపై మరోసారి తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన వేదికగా ఉండాల్సిన ప్రజావాణి, ఫిర్యాదుదారుల ఆవేదన వేదికగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# మీ బాధ, ఆక్రోశం నేను అర్థం చేసుకోగలను జగన్ రెడ్డి

**- 16 వేల మంది టీచర్లను జగన్ అవమానిస్తున్నారని విమర్శ**

**- ఎంపికైన అభ్యర్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్**



అమరావతి (ప్రశ్న న్యూస్) మెగా డీఎస్సీపై వ్యాఖ్యలు చేసిన మాజీ సీఎం జగన్ పై ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లను జగన్ అవమానిస్తున్నారని, వారికి లెంపలు వేసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. "మీ బాధ, ఆక్రోశం నేను అర్థం చేసుకోగలను జగన్ రెడ్డి గారు! మీ ఐదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చెయ్యలేదు, జాబ్ క్యాలెండర్ ఊసేలేదు. మేం 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ ఇచ్చాం. త్వరలోనే మరో డీఎస్సీ కూడా ఇవ్వబోతున్నాం. మరింత బిగ్గరగా ఏడవడానికి సిద్ధంగా ఉండండి జగన్ గారూ! మీరు టెన్త్ పేపర్లు ఎత్తుకెళ్లిన దొంగ అని, అందరూ అలాగే ఉంటారనుకోవడం చాలా పెద్ద నేరం. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీలో, నిద్రాహారాలు మాని, చదివి ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన 16 వేల మందిని మీరు అనుమానిస్తున్నారు, అవమానిస్తున్నారు. మెగా డీఎస్సీలో ఎంపికైన టీచర్లు అందరికీ జగన్ గారు లెంపలు వేసుకుని క్షమాపణలు చెప్పాలి. మెగా డీఎస్సీ ఆపాలని 200 కేసులు, గూగుల్, టీసీఎస్ రాకుండా కోర్టులో కేసులు వేయించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా, యువతకు ఉద్యోగాలు లేకుండా వారి భవిష్యత్తు నాశనం చేయాలని చూస్తున్న జగన్ గారూ మిమ్మల్ని రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ క్షమించరు" అంటూ లోకేష్ ఘాటుగా స్పందించారు.

# డూప్లికేట్ ఓట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- కూకట్‌పల్లి బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్**

**- ఎస్ఐఆర్ పై ప్రత్యేక ప్రజెంటేషన్ - పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలకు ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు నమోదు చేయిస్తున్న దొంగ, డూప్లికేట్ ఓట్ల పట్ల బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ఏ ఒక్క ఓటరును కోల్పోకుండా క్షేత్రస్థాయిలో పక్కాగా పనిచేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే హైదరాబాద్ నగరంలో ప్రతి ఇంటికీ 24 గంటల పాటు నిరంతరం తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో తెలంగాణకు 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని, అదే రీతిలో నగరానికి నిరంతర మంచి నీరు అందించేది కూడా కేసీఆరేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మార్కు పరిపాలనపై పూర్తి అవగాహన ఉండబట్టే, నగర ప్రజలు గత ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా ఇవ్వలేదని అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కట్టిన ఫ్లై ఓవర్లు, ఆసుపత్రులు, ప్రభుత్వ భవనాలను ఇప్పుడు కాంగ్రెస్ నేతలు ఓపెన్ చేస్తూ తామే కట్టామంటూ అబద్ధాలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో తాము కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెట్టామని, అయితే ఈసారి అధికారంలోకి వచ్చాక పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తగిన ప్రాధాన్యత, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# కూతురి వేధింపులు భరించలేను

**- కూతురి తీరుతో విసిగిపోయిన వృద్ధురాలు**

**- ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించినా తప్పని వేధింపులు**

**- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వృద్ధురాలు**




జగిత్యాల (ప్రశ్న న్యూస్) కంటే కూతుర్నే కనాలి అని ఒకప్పుడు అనేవారు. కడుపున పుట్టిన కొడుకులు పట్టించుకోకపోయినా కన్నకూతురు తల్లిదండ్రులకు అండగా ఉంటుందనే భావనతో ఇలా అనేవారు. కానీ కాలం మారింది. తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, హింసించే విషయంలో కొడుకులకు తీసిపోని రీతిలో కూతుళ్లు వ్యవహరిస్తున్నారు. నా కూతురి వేధింపులు భరించలేకపోతున్నానయ్యా చనిపోవడానికి అనుమతి ఇవ్వండి అని 80 ఏళ్ల ఓ పెద్దావిడ అధికారుల దగ్గర వాపోవడమే దీనికి నిదర్శనం. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన గంగవ్వది ఈ దీన గాథ. ఆమె భర్త ప్రభుత్వ ఉద్యోగి. ఆయన ఉద్యోగం చేస్తుండగానే చనిపోవడంతో కారుణ్య నియామకం కింద గంగవ్వ మూడో కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం దక్కింది. జీవితానికి భరోసా ఇచ్చే సర్కారు కొలువు వచ్చింది కాబట్టి ఆస్తిలో వాటా అడగొద్దని అప్పుడే ఆమెకు షరతు విధించారు. పెద్దల సమక్షంలో ఈ మేరకు అగ్రిమెంట్ పేపర్ మీద సంతకం కూడా చేసింది. భర్త మరణించిన అనంతరం గంగవ్వ కుమార్తెకు 27 ఏళ్ల క్రితమే ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి ఆమె తల్లి ఇంట్లోనే ఉంటోంది. తల్లిని మానసికంగా వేధిస్తోంది. తన దగ్గర ఉన్న రూ.9 లక్షల నగదు, మూడు తులాల బంగారం తీసేసుకొని, గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని మళ్లీ ఇటీవల తిరిగొచ్చి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిందని గంగవ్వ ఆరోపిస్తోంది. వయోభారం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తనను ఇంట్లోకి రానివ్వడం లేదని వస్తే చంపేస్తానని బెదిరిస్తోందని ఆమె వాపోయింది. మూడో కుమార్తె వేధింపులతో విసిగిపోయిన ఆమె 80 ఏళ్ల వయసులో తన పెద్ద కూతురి దగ్గర ఆశ్రయం పొందుతోంది, కూతురి వేధింపులు భరించలేక ఆమె గతంలోనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆర్డీవో ఆఫీసుకు వెళ్లి తన గోడు వెళ్లబోసుకుంది. అయినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. దీంతో ప్రజావాణి కార్యక్రమానికి వెళ్లిన ఆమె తన కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలని అధికారులను వేడుకుంది. వయోభారంతో బాధపడుతున్నానని చాలా కాలంగా బీపీ, షుగర్‌తో సతమతం అవుతున్నానని దీనికి కూతురి వేధింపులు తోడు కావడంతో తట్టుకోలేకపోతున్నానంటూ అధికారుల దగ్గర కన్నీటి పర్యంతమైంది.

# నడి నెత్తిన నిప్పుల వాన

**- తెలంగాణకు తొలిసారి రెడ్ అలర్ట్**

**- మరో 4 రోజులు ఇదే పరిస్థితి**

**- పలు జిల్లాల్లో అతి తీవ్రమైన వడగాల్పులు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రచండ భానుడి భగభగలతో తెలంగాణ నిప్పుల కొలిమిని తలపిస్తోంది. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతూ ఉండగా తీవ్రమైన వడగాల్పులకు జనం అల్లాడిపోతున్నారు. మరో నాలుగు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ఎండల తీవ్రత కొనసాగుతుందన్న ఐఎండీ వడగాల్పులు అతి తీవ్రస్థాయిలో వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. తొలిసారి వడగాల్పులపై రెడ్ అలర్ట్ జారీచేయడం ఇదే మొదటిసారి. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మంలో అతి తీవ్రస్థాయిలో వడగాల్పులు వీస్తాయని హెచ్చరించింది. ఈ ఐదు జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ సహా ఎనిమిది జిల్లాలో తీవ్ర వడగాల్పులకు అవకాశం ఉందన్న ఐఎండీ.. ఆరెంజ్ అలర్ట్ ఇచ్చింది. వీటితో పాటు నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగామ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ అయ్యింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య బయట తిరగొద్దని సూచించింది.

# తెలంగాణలో వరి యుద్ధం

**- అన్నదాతల కన్నీళ్లా.? లేక రాజకీయాలా.?**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ప్రస్తుతం వరి ధాన్యం కొనుగోళ్ల అంశం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. ఒకవైపు ప్రభుత్వం రికార్డు స్థాయిలో కొనుగోళ్లు చేస్తున్నామని చెబుతుంటే, మరోవైపు క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై విపక్షాలు విమర్శల జడివాన కురిపిస్తున్నాయి.

### - ప్రభుత్వ క్లెయిమ్ వర్సెస్ విపక్షాల ఆరోపణ

తెలంగాణ ప్రభుత్వం ఈ రబీ సీజన్‌లో సుమారు 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే 80 శాతానికి పైగా కొనుగోళ్లు పూర్తయ్యాయని ప్రకటిస్తున్నారు. అయితే, బీఆర్ఎస్,బీజేపీ నేతలు ఈ గణాంకాలను సవాల్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో కేవలం 25-35 శాతం మాత్రమే కొనుగోలు జరిగిందని, ప్రభుత్వం తప్పుడు లెక్కలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శిస్తున్నారు. ఈ పరస్పర విరుద్ధ ప్రకటనలు అన్నదాతల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి.

### - కల్లాల్లో రైతుల కష్టాలు

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చి వారాలు గడుస్తున్నా తూకం వేయడంలో జాప్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన కొద్ది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతుల గుండెల్లో రైళు పరిగెత్తిస్తున్నాయి. కళ్ల ముందే ధాన్యం తడిసి ముద్దవుతుంటే, తూకం వేయని ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఆరుగాలం శ్రమించి పండించిన పంట వర్షార్పణం అవుతుంటే మా గోడు వినేవారేలేరు అని రైతులు వాపోతున్నారు.

### - మౌలిక సదుపాయాల కొరత

విపక్షాలు ప్రధానంగా గన్నీ బ్యాగుల కొరత, హమాలీల లేమిర రవాణా సౌకర్యాల జాప్యంపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. ధాన్యం కొన్న తర్వాత మిల్లులకు తరలించడానికి లారీలు సకాలంలో రాకపోవడంతో కేంద్రాల వద్దే రాశులు పేరుకుపోతున్నాయి. ఇది కాక, తరుగు పేరుతో మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ అంశాలపై పర్యవేక్షణ లోపించడం ప్రభుత్వ వైఫల్యంగా విపక్షాలు అభివర్ణిస్తున్నాయి.

### - ప్రభుత్వ బాధ్యత - తక్షణ చర్యల ఆవశ్యకత

ప్రభుత్వం కేవలం వీడియో కాన్ఫరెన్స్‌లకు పరిమితం కాకుండా, ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాల్సిన బాధ్యత ఉంది. తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే కొనుగోలు చేస్తామన్న భరోసా రైతులకు కల్పించాలి. మిల్లర్లు తరుగు పేరుతో కోతలు విధించకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. మే నెల ముగిసేలోగా వంద శాతం కొనుగోళ్లు పూర్తి చేయాలని సీఎం జారీ చేసిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు అవుతున్నాయో లేదో కలెక్టర్లు పర్యవేక్షించాల్సి ఉంది.

### - రైతు సంక్షేమమే ముఖ్యం

రాజకీయాల్లో గెలుపోటములు సహజం, కానీ రైతు సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం వహించడం ఏ ప్రభుత్వానికైనా శ్రేయస్కరం కాదు. గతంలో

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588